టీడీపీ పార్టీలోకి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న దృశ్యం



## రాష్ట్రంలో విధ్వంస పాలన

- రాష్ట్రాన్ని సరిదిద్దాలంటే బాబు రావాలి
- చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట, జనవరి 10: సీఎం జగన్ రాష్ట్రంలో విధ్వంసకాండ సృష్టించారని రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. బుధవారం మండలంలోని సాలాబాదు గ్రామంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలో ప్రజా సమస్యలపై విస్తృతంగా పర్యటించారు. గ్రామాల్లో ఉన్న పారిశుధ్యం, వీధి లైట్లు, రోడ్లు, పారిశుధ్యం సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. విద్య, ఉపాధి లేక యువత రోడ్డున పడ్డారని, ఐదేళ్ల రాష్ట్రానికి వైసీపీ ప్రభుత్వం చేపట్టింది శూన్యమన్నారు. సంక్షేమం పేరుతో ప్రజలను నిలువుదోపిడీ చేశారని, రూ.వంద ప్రజలకిచ్చి రూ.వెయ్యి ప్రజల నుంచి తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రాన్ని సరిదిద్దాలన్నా, రాష్ట్రం బాగుపడాలన్నా మరోసారి సీఎంగా చంద్రబాబు నాయకత్వం అవసరమన్నారు.

### టీడీపీలో చేరిన మాజీ ఎంపీపీ

మండలంలోని సాలాబాదు గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ లంకమల్లేశ్వరరెడ్డి చమర్తి జగన్‌మోహన్‌రాజు సమక్షంలో పార్టీలో చేరారు. వీరితో పాటు చిన్నపోలు వెంకట్రాంరెడ్డి, పెంచలయ్య, శేషారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100 కుటుంబాలు పార్టీ కండువా కప్పుకున్నారు. కాగా సాలాబాదు గ్రామం వైసీపీకి కంచుకోటగా ఉండడంతో ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, శివారెడ్డి, మావిళ్ల శ్రీహరి, మోదుగుల నరసింహులు, బి.వి.రమణ, పలుకూరు దత్తాత్రేయులు, మునగపాటి రమణ, చౌడయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## 13 నుంచి సురభి నాటకోత్సవాలు

పులివెందుల, జనవరి 10 : పులివెందులలో 13 నుంచి 18 వతేదీ వరకు సురభి నాటకోత్సవాలు జరగనున్నట్లు పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా పట్టణంలోని గరండాల రివర్ (రాణితోపు)లో ప్రఖ్యాత సురభి కళాకారులచే ఈ నాటకోత్సవాలు సాగనున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 6.30 నుంచి 8.30 వరకు నాటకాలు ప్రదర్శించనున్నారు. 13వ తేదీ శనివారం మాయాబజారు, 14న భక్తప్రహ్లాద, 15న పాతాళభైరవి, 16న శ్రీకృష్ణతులాభారం, 17న బాలనాగమ్మ, 18న శ్రీపద్మావతి శ్రీనివాస కల్యాణం నాటకాలు ప్రదర్శించనున్నారు. ఈ నాటకోత్సవాలను అందరూ విజయవంతం చేయాలని పాడా ఓఎస్డీ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.



రాజంపేట సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి ముఖ్యమంత్రి వైఎజ్ జగన్మోహన్‌రెడ్డి మొండిచేయి చూపారు. గత వారంలో తాడేపల్లె ప్యాలేస్‌కు మేడాను పిలిపించుకుని.. టికెట్ నీకే.. వెళ్లి పనిచేసుకోమని ముఖ్యమంత్రి చెప్పినట్లు విస్తృతంగా ప్రచారం జరిగింది. మేడా అనుచరులు కూడా మూడవసారి ఎమ్మెల్యేగా గెలవబోతున్న మా నాయకుడు అంటూ.. ఇదే విషయాన్ని సోషియల్ మీడియా వేదికగా పంచుకున్నారు. అయితే బుధవారం సాయంత్రం మేడా సోదరులను తాడేపల్లె ప్యాలెస్‌కు పిలిపించిన జగన్.. మేడాకు టికెట్ ఇవ్వడం లేదని చెప్పినట్లు సమాచారం. ఈయనకు బదులుగా ఉమ్మడి కడప జిల్లా జడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డికి టికెట్ ఇవ్వనున్నట్లు సమాచారం. దీని వెనుక రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వారం రోజుల్లోనే మాట మార్చడంతో.. ఇదీ జగన్ మార్కు విశ్వసనీయత అంటే.. అని పలువురు పేర్కొంటున్నారు.

- మొన్న పని చేసుకోమన్నారు.. నేడు వద్దన్నారు
- చక్రం తిప్పిన ఎంపీ మిథున్‌రెడ్డి
- ఇదీ జగన్ మార్కు విశ్వసనీయత..



ఏడాది క్రితం ఎమ్మెల్యే మేడాకు వ్యతిరేకంగా వేసిన పోస్టర్లు

# మేడాకు.. మొండిచేయి

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): 2014లో తెలుగుదేశం పార్టీ తరపున జిల్లాలో ఏకైక ఎమ్మెల్యేగా మేడా మల్లికార్జున రెడ్డి గెలుపొందారు. ఆయనకు మంత్రి పదవి ఇవ్వనప్పటికీ.. చంద్రబాబునాయుడు వాళ్ల కుటుంబానికి మంచి గౌరవమే ఇచ్చారు. మేడ మల్లికార్జునరెడ్డి తండ్రిని టీటీడీ పాలకమండలి సభ్యులుగా నియమించారు. ఆ తర్వాత జరిగిన అనేక నాటకీయ పరిణామాల నేపథ్యంలో.. 2019 ఎన్నికల్లో మేడా మల్లికార్జునరెడ్డి వైసీపీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఎందుకనో.. మొదటి నుంచీ రాజంపేట నియోజకవర్గంలో మేడాకు, ఎంపీ మిథున్‌రెడ్డికి పొసగడం లేదు. పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నుంచే మేడాకు వ్యతిరేకంగా ఒకవర్గం పనిచేస్తూ ఉంది. దీని వెనుక ఎంపీ ఆశీస్సులు ఉన్నాయనే పుకార్లు ఉన్నాయి. నియోజకవర్గంలో కనీసం అధికారుల బదిలీల విషయంలో సైతం తమ నాయకుని మాట చెల్లుబాటు కాకుండా చేశారని ఎమ్మెల్యే మేడా వర్గీయులు ఆరోపిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో గత ఏడాది మేడా మల్లికార్జునరెడ్డికి వ్యతిరేకంగా గుర్తుతెలియని వ్యక్తులు నియోజకవర్గ వ్యాప్తంగా పోస్టర్లు వేశారు. కరపత్రాలు పంచి పెట్టారు. దీని వెనుక.. అధికార పార్టీలోని కొందరు పెద్దల హస్తం ఉన్నట్లు సమాచారం. వీటన్నింటి నేపథ్యంలో ఈసారి ఎన్నికల్లో మేడాకు టికెట్ దక్కకపోవచ్చనే ప్రచారం సుమారు సంవత్సర కాలంగా ఉంది. అయితే గత వారంలో మేడా సోదరులను ముఖ్యమంత్రి తాడేపల్లె ప్యాలెస్‌కు పిలిపించుకుని మాట్లాడి.. పనిచేసుకోమని చెప్పడంతో.. వరుసగా మూడోసారి మేడా అసెంబ్లీ బరిలో ఉంటాడనే అందరూ అనుకున్నారు. ఆయన అనుచరులు సంబరాలు జరుపుకున్నారు. అయితే సీఎం మాట ఇచ్చి.. వారం కూడా గడకముందే.. మేడాకు మొండిచేయి చూపించారు.

### చక్రం తిప్పిన ఎంపీ మిథున్

రాయలసీమలో అభ్యర్థుల ఎంపికలో కీలక పాత్ర పోషిస్తున్న రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఎమ్మెల్యే మేడాకు టికెట్ విషయంలో చక్రం తిప్పినట్లు తెలిసింది. మేడా మల్లికార్జునరెడ్డికి ఇస్తే గెలవలేడు.. దీంతో తన గెలుపు కూడా కష్టం ఆవుతుంది.. కాబట్టి.. మేడాను మార్చాల్సిందేనని ముఖ్యమంత్రి వద్ద ఎంపీ గట్టిగా పట్టుబట్టినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆయన సోదరుడు మేడా రఘునాథరెడ్డిలను ముఖ్యమంత్రి తాడేపల్లె ప్యాలెస్‌కు పిలిపించారు. చావు కబురు చల్లగా చెప్తూ.. అక్కడ మీరు గెలవలేరు.. మనకు గెలుపు ముఖ్యం.. నియోజకవర్గ ఇన్‌చార్జిగా జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిని నియమిస్తున్నామని చెప్పినట్లు తెలిసింది. పార్టీ అధికారంలోకి వస్తే.. మేడా రఘునాథరెడ్డిని రాజ్యసభకు, మేడా మల్లికార్జునరెడ్డిని ఎమ్మెల్సీ చేస్తానని ముఖ్యమంత్రి చెప్పినట్లు సమాచారం. టికెట్ ఎవరికి ఇచ్చినా అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలని ముఖ్యమంత్రి మేడా సోదరులకు సూచించినట్లు తెలిసింది. ప్రస్తుతానికి రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆకేపాటి అమరనాథరెడ్డిని నియమించినా.. ఎన్నికలనాటికి మరెన్ని మార్పులు జరుగుతాయో అని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

## అప్పుడు ఇస్తామన్నారు.. ఇప్పుడు కుదరదంటున్నారు..!

- స్థలం మ్యాపింగ్ అయ్యాక స్థానికేతరులుగా గుర్తింపు
- ఆ మాట ముందే చెప్పాల్సిందంటున్న లబ్ధిదారులు
- పీలేరు ఏపీఐఐసీ 3వ లే-ఔట్‌లో వెలుగు చూసిన మరో కోణం



లక్కీ డిప్ టోకెన్లు చూపుతున్న లబ్ధిదారులు

పీలేరు, జనవరి 10: "ఇంటి కోసం వలంటీరు ద్వారా సచివాలయంలో అప్లై చేసినప్పుడేమో మీకు ప్లాట్ కేటాయిస్తామన్నారు. లక్కీ డిప్‌లో టోకెన్, పట్టా నెంబరు ఇచ్చారు. తరువాత మ్యాపింగ్ చేశారు. తీరా పట్టా చేతికి ఇవ్వమంటే మీరు ఈ ఊరి వాళ్లు కాదు పొమ్మంటున్నారు. ఈ మాట ముందే చెప్పేసుంటే మా బాధ మేం పడేవాళ్లం. సుమారు పది నెలలు ఇదో అదో అంటూ తిప్పుకుని ఇప్పుడు సావు కబురు సల్లగా చెబుతున్నారు" అంటూ పీలేరు పట్టణంలోని ఆటోనగర్, శంకరాపురం, బండ్లవంక ప్రాంతాలకు చెందిన సుమారు 40 మంది జగనన్న కాలనీ లబ్ధిదారులు వాపోతున్నారు. పీలేరు ఏపీఐఐసీ 3వ లే-ఔట్ అమలులో జరిగిన అనేక అవకతవకల్లో ఇది మరో కోణం.

పొట్ట చేతపట్టుకుని భవన నిర్మాణ రంగంలో కూలీలుగా పనిచేసేందుకు ఏడెనిమిదేళ్ల క్రితం పీలేరుకు పొరుగున ఉన్న సదుం, చిన్నగొట్టిగల్లు, కేవీపల్లె, రొంపిచెర్ల మండలాలకు చెందిన వారు పీలేరుకు వచ్చి స్థిరపడ్డారు. వీరు జగనన్న కాలనీల ద్వారా సొంతింటి కల నేరువేర్చుకుందామనుకున్నారు. వీరి ఆధార్ కార్డుల్లో ఆయా మండలాలకు చెందిన చిరునామాలే ఉన్నాయి. అయినా జగనన్న కాలనీ లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు గొప్పగా చెప్పుకునే 'సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్' ప్రక్రియలో అర్హులుగా నిర్ధారణ అయ్యారు. అంతా అయిన తరువాత మేల్కొన్న రెవెన్యూ అధికారులు ఇప్పుడు పట్టాలు ఇవ్వడం కుదరదంటున్నారు. తెలిసో, తెలియకో తాము మోసపోయామని, తమకు న్యాయం చేయాలని వారు బుధవారం తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నాకు సిద్ధమయ్యారు.

### ఆధార్ కార్డులో చిరునామాలున్నా..

ఆధార్, రేషన్ కార్డులను పీలేరుకు మార్చుకోవాలన్న నిబంధనను సైతం పక్కనపెట్టి ఆయా ప్రాంతాల్లోని స్థానిక నాయకులు, వలంటీర్లు ఆయా సచివాలయాల్లో దరఖాస్తులు అందజేశారు. జగనన్న కాలనీ లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్ ప్రక్రియ అవలంభిస్తోంది. ఈ క్రమంలో అధికారుల ద్వారా వడపోత జరుగుతుందని, ఎటువంటి అవకతవకలకు తావు లేదని అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు గొప్పగా చెబుతుంటారు. మరి పీలేరు కాకుండా బయటి మండలాల చిరునామాలు కలిగిన దరఖాస్తులు ఆ వడపోతలను దాటి ఎలా ముందుకు వెళ్లాయో అర్థం కావడం లేదు. లక్కీ డిప్ తీసేటప్పుడైనా కనుగొన్నారా అంటే అదీ లేదు. అనంతరం లబ్ధిదారులకు మ్యాపింగ్ చేశారు. తీరా పట్టాలు లబ్ధిదారుల చేతికి ఇచ్చేయాల్సిన సమయం వచ్చినప్పుడు 'మీరు బయటి మండలాలకు చెందిన వారు. ఇక్కడ ఇల్లు ఇవ్వడం కుదరదు' అంటూ తేల్చేశారు. అదీ గత ఏడాది ఏప్రిల్ మాసంలో వీరికి ఏపీఐఐసీ 3వ లే-ఔట్‌లో పట్టాలు మంజూరు చేశారు. అప్పట్లో జరిగిన బహిరంగ సభలో 10 మందికి పట్టాలు ఇచ్చి, మిగిలిన వారిని తమ కార్యాలయం వద్దకు రావాలని చెప్పారు. అంతే ఆ తరువాత కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోలేదని, తీరా ఇప్పుడేమో మీరు అనర్హులంటున్నారని వాపోతున్నారు.

### ముందే చెప్పేసి ఉంటే...

తాము పీలేరులో ఇళ్ల పట్టాలు పొందేందుకు అనర్హులమని దరఖాస్తు చేసుకున్న మొదటి రోజే చెప్పి ఉంటే తమ తమ ఊళ్లలోనే దరఖాస్తు చేసుకునేవాళ్లమని బాధితులు తెలిపారు. అంతా అయిపోయింది, ఈరోజో రేపో మీకు పట్టా వచ్చేస్తుందని చెప్పిన అధికారులు, వలంటీర్లు, నాయకులు, ఈ రోజు ఇవ్వమంటున్నారని, తమ పరిస్థితి నోటికాడికొచ్చిన కూడును లాగేసుకున్నట్లుందని వారు కన్నీటి పర్యంతమయ్యారు. కూలికిపోతేగానీ డొక్కాడని తమను గడిచిన 10 నెలలుగా పలుమార్లు తహసీల్దారు కార్యాలయం వద్దకు తిప్పారని, తమ పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ దీనస్థితిని పరిగణలోకి తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు రెవెన్యూ అధికారులను కోరారు. కాగా పీలేరులో బుధవారం తహసీల్దారు అందుబాటులో లేకపోవడంతో స్థానిక సిబ్బందికి లబ్ధిదారులు వినతిపత్రం ఇచ్చారు.

## 3,685 మంది అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులు

- 10 రోజుల్లో సంజాయిషీ ఇవ్వండి

మీరు 28 రోజులు విధులకు హాజరు కాలేదు.. మిమ్మల్ని ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించకూడదో..? 10 రోజుల్లో సంజాయిషీ ఇవ్వండంటూ స్త్రీ శిశు సంక్షేమశాఖ అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. నిరవధిక సమ్మెలో వున్న అంగన్వాడీలు ఈ నెల 9వ తేది సాయంత్రం 5గంటల లోపు విధుల్లో చేరాలని డెడ్‌లైన్ విధించిన ప్రభుత్వం.. ఈ ఉత్తర్వులను ధిక్కరించిన జిల్లాలోని 3,685 మంది అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తోంది. అంగన్వాడీల సమ్మెపై ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించినా వారు వెనక్కు తగ్గకపోవడంతో షోకాజ్ నోటీసుల పర్వానికి ప్రభుత్వం తెరలేపింది. మిమ్మల్ని ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరిస్తూ భయపెడుతోంది.



అంగన్వాడీ సెంటర్ తలుపునకు షోకాజ్ నోటీసులు అతికించిన సూపర్‌వైజర్



అంగన్వాడీలకు రిజిస్టర్ పోస్టులో పంపేందుకు సిద్ధం చేసిన షోకాజ్ నోటీసుల పోస్టులు

మదనపల్లెటౌన్, జనవరి 10: జిల్లాలో 2,275 అంగన్వాడీ సెంటర్లు వుండగా వీటిలో 1859 అంగన్వాడీ సెంటర్లు, 416 మినీ సెంటర్లు వున్నాయి. అందులో 1,859 అంగన్వాడీ సెంటర్లు, 402 మినీ అంగన్వాడీ సెంటర్లు పొజిషన్‌లో వున్నాయి. గత నవంబరు 20వ తేది ప్రభుత్వానికి సమ్మె నోటీసులు ఇచ్చిన అంగన్వాడీలు డిసెంబరు 12వ తేది నుంచి అంగన్వాడీ సెంటర్లను మూసి వేసి నిరవధిక సమ్మెలోకి వెళ్లిపోయారు. దీంతో గర్భిణీలు, బాలింతలు, ఆరేళ్ల లోపు చిన్నారులకు పౌష్టికాహారం పం పిణీలో అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్ల తాళాలు ప గులకొట్టి వాటి పర్యవేక్షణ, పౌష్టికాహారం పంపిణీ బాధ్యతలను ఎంఎస్‌కేలు, వెలుగు గ్రూపు సభ్యులకు అప్ప గించింది. కానీ అంగన్వాడీ సెంటర్లకు చిన్నారులను మాత్రం రప్పించలేకపోయింది. ఇదిలా వుండగా చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడం, రక్తహీనత వున్న గర్భిణులకు వైఎస్సార్ కిట్ల పంపిణీ సక్రమంగా జరగడం లేదు. దీనివల్ల జిల్లాలో 3-6 లోపు సంవత్సరాల వయసు వున్న చిన్నారులు 43,614 మంది వుండగా, వీరిలో కేవలం 3 వేల మంది చిన్నారులు కూడా సెంటర్లకు రావడం లేదు. దీంతో ఎంఎస్‌కేలు నిస్సహాయతతో మిగిలిపోవాల్సి వస్తోంది.

### ఎస్మా చట్టం... షోకాజ్ నోటీసులు

అంగన్వాడీ లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, పౌష్టికాహారం చేరకపోవడం, దైనందిన కార్యక్రమాలకు బ్రేక్ పడటం తదితర కారణాలు చూపుతూ ప్రభుత్వం అంగన్వాడీల నిరవధిక సమ్మెపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించింది. కేవలం అత్యవసర ప్రభుత్వ సర్వీసు ఉద్యోగులు సమ్మె చేస్తే ప్రయోగించాల్సిన ఎస్మా చట్టాన్ని ప్రత్యేక జీవో-2 తీసుకొచ్చి అంగన్వాడీలపై ప్రయోగించింది. అయినా అంగన్వాడీలు బెదరకుండా నిరవధిక సమ్మెను 28 రోజుల పాటు కొనసాగించారు. దీంతో ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి అంగన్వాడీలను ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించకూడదో కారణం తెలపాలని షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీనికి ఈనెల 9వ తేదీలోపు విధుల్లోకి రావాలని ఉత్తర్వులు జారీ చేసింది. కానీ జిల్లాలో 1,671 మంది అంగన్వాడీ వర్కర్లు, 317 మంది మినీ అంగన్వాడీ వర్కర్లు, 1,697 మంది అంగన్వాడీ హెల్పర్లు నిరవధిక సమ్మెలోనే వుండిపోయారు. దీంతో అంగన్వాడీ జిల్లా ఎంపిక కమిటీ ఛైర్మన్ అయిన కలెక్టర్ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 3,685మంది అంగన్వాడీలకు బుధవారం నుంచి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు. ముఖ్యంగా సమ్మెలో వున్న ప్రతి అంగన్వాడీ వర్కర్, మినీ వర్కర్, హెల్పర్ ఇళ్ల గోడలకు, అంగన్వాడీ సెంట ర్ గోడలకు షోకాజ్ నోటీసులు అతికిస్తున్నారు. దీంతో పా టు వారి ఇంటి అడ్రస్సుకు రిజి స్టర్ పోస్టు ద్వారా షోకాజ్ నోటీ సులు పంపుతున్నారు. పది రోజుల్లో షోకాజ్ నోటీసులకు సమాధానం చెప్పాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

### 13వ తేదీ చర్చలు సఫలమయ్యేనా..?

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సమ్మెపై ఈ నెల 13న సీఐటీయూ నాయకులు, అంగన్వాడీ అసోసియేషన్ నాయకులతో చర్చించనున్నట్లు సమాచారం. మొండి పట్టుదలతో వున్న అంగన్వాడీల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరిస్తుందా..? లేక షోకాజ్ నోటీసులను ధిక్కరించిన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తుందా అన్నది.. పది రోజుల్లో తేలిపోనుంది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు ఎన్ని బెదిరింపులకైనా తాము తలొగ్గమని అంగన్వాడీలు తెగేసి చెబుతున్నారు.

## టిప్పర్, బైక్ ఢీకొని ముగ్గురు దుర్మరణం

- మృతులందరిదీ మదనపల్లె

ఎ.కొండూరు, జనవరి 10: విజయవాడ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందిన ఘటన ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం రామచంద్రాపురంలో బుధవారం జరిగింది. తిరువూరు సీఐ అబ్దుల్ నబీ తెలిపిన వివరాల ప్రకారం అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన చెందిన షేక్ హాస్సేనబీ(55), నాగుల్‌మీరా (30), నాగుల్ మీరా (23)లు బతుకుదెరువు కోసం గంపలగూడెం మండలం వినగడప గ్రామంలో నివాసం ఉంటున్నారు. అక్కడికి సమీపంలోని తోటమూలలో ఇద్దరు నాగుల్ మీరాలు ఒకరు టీ స్టాల్‌లో, మరొకరు బేకరీలో పనిచేస్తున్నారు. వీరిలో ఒక నాగుల్ మీరా భార్య అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఉన్నారు. ఆమె చూడటానికి తల్లి హాస్సేబీని తమ బైక్‌పై ఇద్దరు నాగుల్ మీరాలు ఎక్కించుకుని విజయవాడ రెల్వేస్టేషన్‌లో దింపడానికి వెళుతున్నారు. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామ సమీపంలో మైలవరం వైపు నుంచి యాష్ లోడుతో వెళుతున్న టిప్పర్ ఎదురుగా వస్తున్న బైక్‌కు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో హాస్సేనబీ 10 మీటర్ల దూరం ఎగిరి పడి మృతి చెందగా, ఇద్దరు నాగుల్ మీరాలు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న తిరువూరు సీఐ అబ్దుల్ నబీ, ఎస్సై అంకారావులు ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను తొలగించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు.



## కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

- మదనపల్లెలో 3,685 మందికి షోకాజ్ నోటీసులు
- రాజంపేటలో గౌరమ్మకు పూజలు
- వాల్మీకిపురంలో మండుటెండలో నిరసన



రాజంపేటలో గొబ్బిళ్లు తడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమ్మె 30వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం ఎన్ని విధాలుగా బెదిరింపులకు పాల్పడినా వెనక్కు తగ్గకుండా నిరసనలు తెలియజేస్తు న్నారు. బుధవారం మదనపల్లెలో 3,685 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మిమ్మల్ని విధుల నుంచి ఎందుకు తొలగించకూడదో చెప్పాలని ఐసీడీఎస్ అధికారులు అందులో పేర్కొన్నారు.

రాజంపేట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు గౌరమ్మను పూజిస్తూ.. నువ్వైనా కాపాడి.. తమ సమస్యలను పరిష్కరించాలి. తమకు న్యాయం చేయాలి అంటూ.. గొబ్బియ్యాల పండుగను చేశారు. వాల్మీకిపురం ప్రాజెక్టు పరిధిలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ఎండలో నిలబడి నిరసన తెలిపారు. మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అధికారులు ఎస్మాలో భాగంగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రాయచోటి జిల్లా కేంద్రం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విశ్వనాథ్‌నాయక్ అరెస్టుకు నిరసనగా అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించి.. ధర్నాను నిర్వహించారు. జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. తంబళ్లపల్లె ప్రాజెక్టు పరిధిలో చెన్నకేశవ స్వామి ఆలయం ఎదుట సర్వమత ప్రార్థనలు చేశారు.



వాల్మీకిపురం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎండలో అంగన్వాడీల నిరసన

# పోలీసు కేసులతో ఉద్యమం ఆగదు

● కలెక్టరేట్ ముట్టడిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య .

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 10: ఎస్మా చట్టం ప్రయోగించి, కేసులతో భయపడితే భయపడడానికి సామాన్యులమైన ఉద్యోగులు కాదు జగన్‌రెడ్డి.. అంగన్వాడీలయ్యా.. గతంలో ఏం జరిగిందో నీ కన్నా ముందు ఉన్న ముఖ్యమంత్రులను అడిగి తెలుసుకో అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడ జీ. ఈశ్వరయ్య అన్నారు. అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వెయ్యి రూపాయలు వేతనం పెంచుతామని హామీ ఇచ్చి మోసం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై పోలీసులు సుమోటోగా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి యత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ అంగన్వాడీలకు కాదు, హామీలు విస్మరించి అంగన్వాడీలు సమ్మెకు కారణమైన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి పోలీసులు నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలను విస్మరిస్తే రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని శంకరగిరి మాన్యాలు పట్టించడం ఖాయమన్నారు. అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపిన ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథనాయక్‌ను తక్షణమే విడుదల చేయాలని సీపీఐ, ఏఐటీయూసీ అంగన్వాడీలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేశ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, కోశాధికారి సలీంబాషా, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి, కోకన్వీనర్ సరోజమ్మ, సుజాత, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుమిత్ర పాల్గొన్నారు.

**రైల్వేకోడూరు:** అంగన్వాడీ సమస్యలపై ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని రైల్వేకోడూరు ప్రాజెక్టు అధ్యక్షురాలు రమాదేవి తెలిపారు. బుధవారం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తమ నాయకులతో చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో తదుపరి చర్చలకు వెళ్లలేదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పద్మ, లీలా, దుర్గ, శిరీషా, రాధ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.



రాయచోటి: మాట్లాడుతున్న ఈశ్వరయ్య



రైల్వేకోడూరు: నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

**లక్కిరెడ్డిపల్లె:** సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ధర్నాలు ఆగవని అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి. ప్రధాన కార్యదర్శి ప్రభావతమ్మ తెలిపారు. బుధవారం స్థానిక దీక్షా శిబిరం వద్ద వారు మాట్లాడుతూ ప్రభుత్వం నోటీసులు జారీచేసి బెదిరిస్తోందన్నారు. కార్యక్రమంలో శారద, శ్రీవాణి, రుక్మిణి ,శిరీష, లక్ష్మిదేవి, నాగవేణి, నాగమణి, ఇరగమ్మ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

**రాజంపేట:** స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట గొబ్బిళ్లు తడుతూ నువ్వైనా మా మొర ఆలకించు అంటూ నిరసన తెలియజేశారు. అంగన్‌వాడీ నాయకురాలు ఈశ్వరమ్మ, మాధవి, జ్యోత్స్న తదితరులు మాట్లాడుతూ వారం రోజులుగా ఆందోళన చేస్తుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## ఎస్మా రద్దు చేయాలి.. జీతాలు పెంచాలి



మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

రాయచోటి(కలెక్టరేట్), జనవరి10: ఎస్మాను తక్షణమే రద్దు చేసి, జీతాలను పెంచాలని వివిధ రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. సంక్రాంతిలోపు ఈ డిమాండ్‌ను పరిష్కరించాలని, లేని పక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించాయి. ఉద్యోగ కార్మిక సంఘాల సమ్మెకు మద్దతుగా సీపీఎం అన్నమయ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాయచోటి కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీడీపీ, సీపీఐ, న్యూ డెమోక్రసీ, జనసేన, వీసీకే పార్టీలు, సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక, ఓపీడీఆర్, కేవీపీఎస్, ఎంహెచ్‌పీఎస్, రజక, ఎంఆర్‌పీఎస్ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ విషయంలో జగన్‌కు శృంగభంగం తప్పదని, మహిళలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. టీడీపీ సీనియర్ నేత సుగవాసి సుబ్రమణ్యం మాట్లాడుతూ అంగన్వాడీల డిమాండ్లు న్యాయబద్ధమైనవంటూ మనస్ఫూర్తిగా మద్దతు తెలిపారు. ఓపీడీఆర్ నాయకుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ ఎస్మా నోటీసు ఇచ్చిన తరువాత న్యాయ సలహా తీసుకోవడం ప్రభుత్వ నిరక్ష్యానికి నిదర్శమన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం ప్రజలు, ప్రజాతంత్ర హక్కులపై దాడి అన్నారు. ప్రజా సంఘాల నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపటి నుంచి ముగ్గుల పోటీలు

సుండుపల్లె, జనవరి 10: మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జనసేన నియోజకవర్గ నాయకుడు అతికారి కృష్ణయ్య సహకారంతో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు జనసేన మండల మహిళా అధ్యక్షురాలు రెడ్డిరాణి బుధవారం తెలిపారు. మొదటి బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు, పోటీల్లో భాగంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు ఇస్తామన్నారు. వీరబల్లి, సుండుపల్లె మండలాలకు చెందిన మహిళలు, యువతులు పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తి గల వారు ఫోన్ నెంబర్ 9182228399కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

## పీఈటీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సుండుపల్లె, జనవరి 10: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెల్లూరు ఐటీడీఏ అధికారిణి ఉత్తర్వులు ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. రిజర్వేషన్ ప్రకారం ఈ పోస్టుకు ఎస్సీ మహిళలు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. జిల్లాలోని బాలుర గిరిజన గురుకుల పాఠశాలలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, ఈ నెల 25వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 29వ తేదీ బాలికల గురుకుల పాఠశాలలో హాజరుకావాలని తెలిపారు.

# ‘జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి’



రాయచోటి: నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు



రాజంపేటలో ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

రాయచోటిటౌన్, జనవరి 10: పాదయాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు చెన్నయ్య, రాంబాబు, అగ్గి రాముడు డిమాండ్ చేశారు. బుధవారం రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన వాగ్దానం అమలులో కాలయాపన తగదన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల కు 11వ పీఆర్‌సీలో ఐనా బేసిక్ వేతనం ఇవ్వాలన్నారు. జనాభాకనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచి ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులపై పనిభారం తగ్గించాలన్నారు. కార్మికులకు మాస్కులు, గ్లౌజులు, కొబ్బరి నూనె, చెప్పులు ఇవ్వలేదన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చి రెగ్యులర్ చేయకపోతే వారి భవిష్యత్ ఏంటని ప్రశ్నించారు. కనీసం ఇప్పుడయినా ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రమణ, తిరుపాల్, సురేంద్ర, అశోక్, రవి, సురేశ్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

**రాజంపేట టౌన్:** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాజంపేట మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారానికి 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు రవికుమార్, మున్సిపల్ కార్మిక నాయకులు లక్ష్మీదేవి, ఓబయ్య, ప్రసాద్, సాలమ్మ, బాలాజీ తదితరులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, తమ ఉద్యోగాలను పర్మినెంటు చేయాలని కోరుతూ తాము 16 రోజులుగా డిమాండు చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేకపోవడం దారుణమన్నారు.

## అభివృద్ధి కావాలంటే చంద్రబాబు సీఎం కావాలి



బాబు ష్యూరిటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి

చిన్నమండెం, జనవరి 10: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని రాయచోటి టీడీపీ ఇన్‌చార్జి రమేశ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కలిబండ గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజావేదిక ఏర్పాటు చేసి గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఆరాతీశారు. ఈ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలు, వ్యవస్థలతో చెలగాటమాడుతోందని , గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్న అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ఎస్మా ప్రయోగిస్తామని బెదిరించడం నీచమైన చర్య అన్నారు. అనంతరం ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, బోనమల ఖాదర్‌వలి, మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, బెల్లం నరసింహారెడ్డి, నాగభూషణ, హరి, అమర్‌నాథరెడ్డి, మస్తాన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, బాషిత్, చెన్నకృష్ణారెడ్డి, దేవగోపాల్‌నాయుడు, ప్రతాప్‌నాయుడు, అలగాని రెడ్డెప్ప, నాగేంద్ర, వండాడి రమేశ్, బోనమల రాజారెడ్డి, బోనమల చెన్నకృష్ణారెడ్డి, వెంకటాద్రి, శివయ్య, వెంకట్రమణ, ఇంజేటి వెంకట్రమణ, గోపాల్, మాయావతి తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్నచమర్తి

వీరబల్లి, జనవరి 10 : యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం మండలంలోని సానిపాయిలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, మాజీ సర్పంచ్ వెంకట్ర మణ, బీసీ నాయకులు జయరాంయాదవ్, మైనార్టీ నాయకులు కాలేశా, చలపతినాయుడు, మహిళాధ్యక్షురాలు నాగసుబ్బమ్మ, భాస్కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## 106 సెక్షన్‌ను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న ట్యాంకర్ డ్రైవర్లు

సిద్దవటం, జనవరి 10 : డ్రైవర్లకు మరణదండనగా మారిన 106 సెక్షన్‌ను వెంటనే రద్దు చేయాలని హెచ్‌పీసీఎల్ ట్యాంకర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షరీఫ్ హుస్సేన్ డిమాండ్ చేశారు. మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న హెచ్‌పీసీఎల్‌లో బుధవారం హెచ్‌పీసీఎల్ ట్యాంకర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లారీ డ్రైవర్లు ఎక్కువ శాతం పేద వర్గాలకు చెందిన వారేనని, ఈ సెక్షన్‌తో వారి కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. ఈ విషయంపై ఆంధ్రప్రదేశ్ లారీ డ్రైవర్స్ అసోసియేషన్స్ ఈ నెల 10 నుంచి 14 వరకు బంద్‌కు పిలుపునిచ్చిందన్నారు. వారికి మద్దతుగా హెచ్‌పీసీఎల్ ట్యాంకర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ బంద్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వేమారెడ్డి, సుబ్బారెడ్డి, దస్తగిరి, నాగూర్, ఆరిఫ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## 22వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె



దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 10: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె నాటికి 22వ రోజుకు చేరింది. బుధవారం అనకాపల్లి జిల్లాలో అమరుడైన ఉద్యమ వీరుడు వాసుదేవ్ ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించి నివాళులర్పించా. ఆయన మరణానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు షోకాజు నోటీసులు అందిన 7 రోజులకు జవాబు ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయడమే కాకుండా సమాన పనికి సమాన వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపి వారి సంఘీభావం తెలియజేశారు.

## చంద్రబాబును కలిసిన మారుతీ ఫౌండేషన్ అధినేత



చంద్రబాబుతో మారుతి

సంబేపల్లె, జనవరి 10: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును బుధవారం మారుతీ గుడి ఫౌండేషన్ అధినేత మారుతి కలిశారు. రాయచోటి నియోజకవర్గంలో టీడీపీ గెలుపు కోసం తీసుకోవాల్సిన చర్యలు, పరిస్థితులపై చర్చించినట్లు తెలిపారు. ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి ఈ సారి విజయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాయచోటి నియోజకవర్గం అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ తరపున కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. రాయచోటి నియోజకవర్గ పరిస్థితులు వివరించినట్లు తెలిపారు.

## టీడీపీ నేతలతో పోలి సుబ్బారెడ్డి భేటీ

ఒంటిమిట్ట, జనవరి 10 : మండలంలోని పలువురు టీడీపీ నాయకులతో రాజంపేట టీడీపీ నేత పోలి సుబ్బారెడ్డి బుధవారం స్థానిక హరిత హోటల్‌లో భేటీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాజంపేట అభ్యర్థిత్వం కోసం తాను ప్రయత్నిస్తున్నానని తనకు మద్దతు తెలపాలని ఈ సందర్భంగా ఆయన కోరినట్లు కల్లుగీత కార్మిక సంఘం మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుడ్డ్ వెంకటేష్, పలుకూరు దత్తాత్రేయులు, మోదుగుల హరి పాల్గొన్నారు.

## వైసీపీ హయాంలో రాష్ట్రం అధోగతిపాలు



విలేకర్లతో మాట్లాడుతున్న పోతుగుంట రమేష్‌నాయుడు

రాజంపేట, జనవరి 10: వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అధో గతి పాలైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్ నాయుడు తెలిపారు. బుధవారం ఆయన రాజంపేటలో విలేకర్లతో మా ట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రాష్ట్రంలో సీఎం జగన్ ఏకగ్రీవంగా ఎన్నికలు జరుపుకోవడానికి పన్నాగం పన్నుతున్నాడన్నారు. కేంద్ర ప్రభుత్వం 25 లక్షల ఇళ్లు ఇస్తే ఇంత వరకు 20 శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వాన్ని సాగనంపడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆది నారాయణ, రమణ, సూర్యచంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ కేంద్ర పథకాలు



గ్యాస్ పంపిణీ చేస్తున్న ఎంపీడీవో దివ్య, యువమోర్చా అధ్యక్షుడు శివప్రసాద్

చిన్నమండెం, జనవరి10: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మారుమూల గ్రామాలోని ప్రతి ఒక్కరికీ అవగాహన పెంపొందించడంతో పాటు అర్హులందరికీ అందేలా చేయడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని బీజేపీ మోర్చా అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. మండలంలోని దేవగుడిపల్లె, కేశాపురం గ్రామ పంచాయతీల్లో జరిగిన బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దివ్య, ఏపీఎం రెడ్డెమ్మ, పంచాయతీ సెక్రటరీలు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రూ. 60లక్షలతో అభివృద్ధి పనులు

నందలూరు, జనవరి10 : మండలంలో 60 లక్షల రూపాయలతో రోడ్ల (నిర్మాణ) అభివృద్ధి పనులు చేపట్టినట్లు రాజంపేట పంచాయతీ రాజ్ డీఈ రవిశంకర్ తెలిపారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ పనుల్లో భాగంగా నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లె ఆర్‌అండ్‌బి అతిథి గృహ సమీపంలో సిమెంటు రోడ్డు పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 15 రోడ్ల పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనుదీప్ జయసింహ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుబ్రమణ్యం, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నవీన్‌కుమార్, పావని పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

నందలూరు, జనవరి10 : మండలంలోని పోలింగ్ కేంద్రాలో వసతులు మెరుగు పరచాలని రాజంపేట ఆర్డీవో రామకృష్ణారెడ్డి స్థానిక తహసీల్దారు వైఎస్ సత్యానందంకు సూచించారు. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 97, 98 పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ కోసం విద్యుత్, నీరు ఇతర సౌకర్యాలు తప్పక ఉండాలన్నారు. నియోజకవర్గంలోని దాదాపు 287 పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను మెరుగు పరచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మోహనకృష్ణ, వీఆర్వో చంద్రశేఖర్‌రాజు, సర్వేయర్లు చంద్రబాబు, కిరణ్ పాల్గొన్నారు.

## ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్యకు అభినందనలు

రాయచోటిటౌన్, జనవరి10: రాజమండ్రిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికైన కామ్రేడ్ గుజ్జుల ఈశ్వరయ్యకు బుధవారం రాయచోటి పట్టణంలోని అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ అన్నమయ్య జిల్లా సమితి, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు అభినందనలు తెలియజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎస్ నరసింహులు మాట్లాడుతూ ఈశ్వరయ్య లాంటి యువనాయకుడు రైతు సంఘానికి బాధ్యుడిగా ఉండడం ఈ రాష్ట్ర రైతాంగం అదృష్టంగా భావించాలని తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి మహేశ్, రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, లంబాడా హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు శంకర్‌నాయక్, ఏఐటీయూసీ నాయకులు సలీంబాషా పాల్గొన్నారు.

## అభివృద్ధి ప్రణాళికలపై ముగిసిన శిక్షణ

రాయచోటిటౌన్, జనవరి10: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) తయారీపై పట్టణంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి అవగాహన కల్పించారు. అనంతరం టీంల వారీగా కేటాయించిన పాఠ్యాంశం పై ఉపన్యాసం చేయించారు. జీపీడీపీ ప్రణాళిక ముఖ్య ఉద్దేశాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులపై సభ్యులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారులు, విస్తరణాధికారులు (పీఆర్ అండ్ ఆర్‌డీ), మండల ఇంజనీరింగ్ అధికారులు, ఏఈడబ్ల్యూఎస్ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు, రీసోర్స్ పర్సన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ జల సంఘం ద్వారా ఇంటింటికి తాగునీరు

వీరబల్లి, జనవరి 10: గ్రామ జలసంఘం ద్వారా ఇంటిం టికి తాగునీటి సౌకర్యం క ల్పించనున్నట్లు వైఎస్‌ఆర్ క్రాంతిపథం సహాయ ప్రాజె క్టు మేనేజర్ ఖాదర్‌వలి తెలిపారు. బుధవారం సోమవరం వడ్డెపల్లెలో సచివాలయ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, 9 మంది చురుకైన స్వయం సహాయక సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి, బ్యాంక్ ఖాతా ప్రారంభించడం జరుగుతుందన్నారు. గ్రామాభివృద్ధికి సహకరించే వారు ఇచ్చే విరాళాలు ఈ ఖాతాలో జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ నాగేంద్ర, వీవోవే విజయ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అయోధ్య అక్షింతలు ఇంటింటికి పంపిణీ

రైల్వేకోడూరు, జనవరి 10: అయోధ్య రామయ్య అక్షింతలతోపాటు అయోధ్య రామమందిరం ఫొటోలను బుధవారం రైల్వేకోడూరు పట్టణంలో ఇంటింటికి రామ భక్తులు పంపిణీ చేశారు. దరిశా వెంకటరెడ్డి, శోడిశెట్టి సుబ్రహ్మణ్యం, మణి, నరసింహులు, రాము, వెంకటరమణ పాల్గొన్నారు.

## ప్రేక్షకులు కరువైన ‘ఆడుదాం ఆంధ్ర’.

నందలూరు, జనవరి 10: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పోటీలకు క్రీడాకారులు అధికారులు మాత్రమే హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటలకు పోటీలు నాగిరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని అరవపల్లె జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో ఎంపీడీవో సౌభాగ్యమ్మ నేతృత్వంలో క్రికెట్ పోటీలను ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. కాగా, మైదానంలోని మట్టి కుప్ప క్రికెట్ క్రీడాకారులను పలు ఇబ్బందులకు గురి చేసింది. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి హరినారాయణ, డిజిటల్ అసిస్టెంట్లు పురుషోత్తం రెడ్డి, సోనీ శామ్యూల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులపై ఆర్డీవో విచారణ



మాట్లాడుతున్న ఆర్డీవో రామకృష్ణారెడ్డి

చిట్వేలి, జనవరి10 : పోల్లోపల్లి పంచాయతీలో ఉపాధి హామీ పనులపై రాజంపేట ఆర్డీవో రామకృష్ణారెడ్డి బుధవారం సాయంత్రం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విచారణ చేసి అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. తహసీల్దారు శిరీష, ఎంపీడీవో శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సేవా ప్రశంసాపత్రాలు పంపిణీ

పెనగలూరు, జనవరి10 : మండలంలోని ఈటిమాపురంలోని దత్తత గ్రామంలో వారం రోజుల పాటు ఎన్ఎస్ సేవా కార్యక్రమాలు నిర్వహించిన పెనగలూరు ఆదర్శ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం ప్రిన్సిపాల్ ఎస్.సహజబ్లెస్సీ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎల్.హేమలత ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూసేవా భావాన్ని ప్రజలతో పంచుకొని సమాజానికి ఉపయోగపడాలని కోరారు. అధ్యాపకులు డాక్టర్ ఏకాంబరం పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మండలంలోని చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం కింద అయ్యలరాజుపల్లె గ్రామంలో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దస్తగిరి సాహెబ్, క్యాంపు పీఈ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో హరిజనవాడలోని ఎంపీపీ పాఠశాలలో పరిసరాలు శుభ్రం చేసి మొక్కలు నాటి నీళ్లు పోశారు. గ్రామంలోని వీధులలో రోడ్లపై ఉన్న చెత్తను, రాళ్లను ఊడ్చివేశారు. రోడ్లపైకి వచ్చిన చెట్లుకొమ్మలను తొలగించారు. చివరి రెండు రోజులు అయ్యలరాజుపల్లె, కమ్మపల్లి హరిజనవాడలో ఎస్ఈసీటీ సర్వే ముగింపు సందర్భంగా యోగి వేమన యూనివర్సిటీ జారీ చేసిన ప్రశంస పత్రాలను విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయుడు శివప్రసాద్‌పాల్గొన్నారు.

## చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

ఓబులవారిపల్లె, జనవరి 10 : చోరీల నివారణపై పోలీసులు మండలంలోని బొమ్మవరం, బీపీరాజుపల్లె, పెద్దఓరంపాడు, మంగళంపల్లె, కాకర్లవారిపల్లె, గొబ్బూరువారిపల్లె, చిన్నంపల్లె, ముక్కావారిపల్లె గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. ముక్కావారిపల్లెలోని కెనరాబ్యాంకు సెక్యూరిటీపై మేనేజర్‌కు సూచనలు ఇచ్చినట్లు రైల్వేకోడూరు సీఐ మధుసూదన్‌రెడ్డి, ఓబులవారిపల్లె ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ఉపేంద్ర పాల్గొన్నారు.

## పోలీసు అధికారులకు సన్మానం



బదిలీ అయిన పోలీసు అధికారులను సన్మానిస్తున్న సిబ్బంది

లక్కిరెడ్డిపల్లె,జనవరి10: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పనిసరి అని రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా తెలిపారు. లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాదు, రామాపురం ఎస్సై కొండారెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎస్సై మల్లికార్జునరెడ్డి, గాలివీడు ఎస్సై శివకుమార్ బదిలీ సందర్భంగా బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె సర్కిల్ పరిధిలో తక్కువ సమయంలో మంచి మన్ననలు పొందారని కొనియాడారు. ప్రతి గ్రామంలో పోలీసు గ్రామ సభలు నిర్వహించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు గంగనాథబాబు, రామకృష్ణారెడ్డి, తులసిరాం, సుధాకర్‌రెడ్డి, మహబూబ్ బాషా, లక్కిరెడ్డిపల్లె ఎస్సై విష్ణువర్ధన్, హెడ్‌కానిస్టేబుల్ రాంప్రసాదు యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు

## తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పండుగ సంక్రాంతి

రైల్వేకోడూరు, జనవరి 10: తెలుగు రాష్ట్రాల ప్రజలు జరుపుకునే పెద్ద పండుగ సంక్రాంతి పండుగ అని తిరుమల-తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ తెలిపారు. బుధవారం విజ్‌డమ్ సీబీఎస్సీ స్కూలులో జరిగిన ముందస్తు సంక్రాంతి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. విద్యార్థిని, విద్యార్థులు పండుగ వాతారవరణం ప్రతిబింబేలా పాఠశాలను అలంకరించారు. సంప్రదాయ దుస్తులు ధరించి రకరకాల వేషాల్లో అలరించారు. పల్లెటూరి వాతావరణాన్ని మరిపించేలా రంగవల్లులు వేశారు. భోగి మంటలు వెలిగించారు. పొంగళ్లు వండారు. రకరకాల బొమ్మలతో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. నృత్య గీతాలతో హోరెత్తించాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రదీప్, అడ్మిన్ డైరెక్టర్ మధుసూదన్, ప్రిన్సిపాల్ కోటేశ్వర్‌రావు, విద్యార్థిని, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ ఆధ్వర్యంలో సంక్రాంతి కానుక పంపిణీ



సంక్రాంతి కానుక అందజేస్తున్న సి.రామచంద్రయ్య

సిద్దవటం, జనవరి 10 : మండలంలోని బొగ్గిడివారిపల్లె పంచాయతీ నాలుగు గ్రామాల ప్రజలకు స్థానిక నాయకుడు కుప్పాల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో బుధవారం సంక్రాంతి కానుక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామచంద్రయ్య మాట్లాడుతూ నిరుపేదలకు నిత్యావసర సరుకులు, రేషన్ పంపిణీ సంతోషకరమన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. వైసీపీ అరాచక పాలన లో ఉండలేక సొంతగూటికి వచ్చానన్నారు. కడప జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కుప్పాల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రాజకీయంగా కొంత మంది వైసీపీ నేతలు తనను ఎంతో ఇబ్బంది పెట్టారని, చివరి రక్తపు బొట్టు వరకు పార్టీ కోసం సేవ చేస్తానన్నారు. జనసేన నేత అతికారి కృష్ణ మాట్లాడుతూ ఎవరి బెదిరింపులకు భయ పడేది లేదన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని తెలుసుకొని మసులుకోవాలని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నేతలు హరిప్రసాద్, గోవర్దన్‌రెడ్డి, జనసేన పార్టీ నాయకులు అతికారి దినేష్, మండల నాయకుడు మోహన్‌రెడ్డి, యువనాయకుడు రాజనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య, కార్యదర్శి నాగమునిరెడ్డి పాల్గొన్నారు.

## చేనేత జౌళి శాఖ క్యాలెండర్ విడుదల

వీరబల్లి, జనవరి10: చేనేత జౌళి శాఖ క్యాలెండర్‌ను ఆ శాఖ ఏడీ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో మట్లికి చెందిన చేనేత సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏడీ శ్రీనివాసులరెడ్డిని దుశ్శాలువాతో, పూల మాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ నాయకులు పాల్గొన్నారు.

# అంతుచిక్కని తెగులు - ఎండుతున్న తోటలు

మందులు వాడినా ఫలితం శూన్యం ● దిగుబడుల్లో తోటలు ఇలా... ● ఆందోళనలో చీనీ రైతులు



తెగులు బారిన పడి పూర్తిగా ఎండిపోయిన చీనీచెట్టు

పులివెందుల, జనవరి 10: పులివెందుల ప్రాంతం చీనీతోటలకు పెట్టింది పేరు. ప్రధాన ఉద్యాన పంటగా చీనీ పంట సాగులో ఉంది. ఒక్కసారి సాగుచేస్తే దాదాపు 20ఏళ్లు ఆ పంట కొనసాగుతుంది. అటువంటి పంట అంతుచిక్కని తెగులుతో తోటలు నిలువునా ఎండిపోతున్నాయి. ఎండుతున్న తోటలు చూస్తే రైతు ఆందోళనకు గురవుతున్నాడు. ఏమి చేస్తే తోటలు దక్కుతాయో అర్థం కావడం లేదని రైతులు మదనపడుతున్నారు. వివరాల్లోకెళితే....

పులివెందులలో రైతులు విరివిగా చీనీ తోటలు సాగుచేస్తున్నారు. ఏడాదికేడాది సాగు పెరుగుతోంది. ప్రస్తుతం 25వేల నుంచి 30వేల ఎకరాల్లో చీనీ తోటలు సాగులో ఉన్నాయి. చీనీ అంటు నాటిన దగ్గరి నుంచి ఫలసాయం ఇస్తున్న తోటల వరకు వివిధ దశల్లో ఉన్నాయి. రెండుమూడేళ్లగా అంతుచిక్కని తెగులు రైతును కలచివేస్తోంది. రెండేళ్లగా ఈ తెగులు తోటల్లో కనిపిస్తున్నా అంత ప్రభావం లేదు. కానీ ఈ ఏడాది దాని ప్రభావం మరింత ఎక్కువై దిగుబడులు ఇచ్చే పెద్దపెద్ద చీనీచెట్లు సైతం నిలువునా ఎండిపోతున్నాయి. చెట్టు మొదలు దగ్గర నుంచి కొమ్మల వరకు చెట్టుకున్న తాట పొలుసులాగా ఊడిపోతోంది. చెట్టు కొమ్మల నుంచి పురుగు తొలిచేసిన పిప్పిడి రాలుతోంది. ఏ తోటలో చూసినా ఎక్కువ సంఖ్యలో చెట్లు ఈ తెగులు బారిన పడుతున్నాయి. ఎకరా పొలంలో వంద నుంచి నూటపది మొక్కలను సాగుచేస్తారు. ఐదేళ్ల పాటు దిగుబడులు లేకపోయినా వీటిని రైతులు పోషించాల్సిందే. అప్పటి వరకు తెగుళ్లబారిన తోటలు కూడా పడవు. దిగుబడులు ప్రారంభమైన తోటల్లోనే ఈ తెగులు ఎక్కువగా ఉంది. ఈ తెగులు పైన కనిపించకుండానే చెట్ల కొమ్మల్లో, మొదలు లోపల భాగాన పురుగు చేరి తొలుస్తోందని రైతులు వాపోతున్నారు. రెండేళ్లగా ఈ తెగులు ప్రభావం అంతంత మాత్రంగా ఉన్నా ఏడాదికేడాది పెరుగుతూ పోతుందేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా తెగుళ్ల ప్రభావం పెరిగితే దిగుబడులు ఇచ్చే తోటలు నాలుగైదేళ్లలో పూర్తిగా తొలగించాల్సిందేనని రైతులు అంటున్నారు. పరిష్కారం చూపాలని ఉద్యాన శాఖ అధికారులను అడిగినా నివారణకు పలు మందులను పిచికారీ చేయమని చెబుతున్నారే కానీ వాటివల్ల ప్రయోజనం ఏమీ లేదని రైతులు అంటున్నారు. ఇదే అదునుగా పురుగుల మందుల వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారు. ఈ తెగులుకు ఏ మందుపిచికారీ చేసినా ప్రభావం చూపడం లేదని రైతులు అంటున్నారు. అయిన కూడా దిగుబడులు ఇచ్చే చెట్లు కళ్లముందే ఎండిపోతోంటే చూడలేక ఏదొక మందు పిచికారీ చేస్తే చెట్లు బతుకుతాయోమోనని ఆశతో పులివెందుల ప్రాంత రైతులు తాడిపత్రి, అనంతపురం తదితర చోట్ల నుంచి అధిక ధరలు వెచ్చించి పురుగులమందులు తెచ్చి పిచికారీ చేస్తున్నారు. ఉద్యాన శాఖ ఈ తెగులు నివారణకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.



తెగులు బారిన పడడంతో ఎండుదశకు చేరుకున్న కాయలతో ఉన్న చీనీ చెట్టు - మొదలు నుంచి పురుగు తొలుచడంతో పిప్పిడి వస్తున్న దృశ్యం

## బయలు దేరిన శబరిమల యాత్ర

బస్సులను ప్రారంభించిన గంటా చైత్ర



శబరిమల ఉచిత బస్సులను ప్రారంభిస్తున్న గంటా చైత్ర

రాజంపేట, జనవరి10: స్థానిక అయ్యప్పస్వామి ఆలయం నుంచి 90 మంది అయ్యప్ప భక్తులతో రెండు బస్సులు శబరిమలైకి బయలు దేరాయి. సుమారు ఆరు లక్షల రూపాయల ఖర్చుతో టీడీపీ నేత గంటా నరహరి ఏర్పాటు చేసిన బస్సులను ఆయన శ్రీమతి గంటా చైత్ర జెండా ఊపి ప్రారంభించారు. అయ్యప్ప స్వామి మాలధారులకు గంటా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అన్ని ఖర్చులు భరిస్తూ యాత్ర ఏర్పాటు చేశామన్నారు. రెండు బస్సుల్లో 7 రోజులు రానూపోనూ యాత్ర కొనసాగుతుందని ఆమె తెలిపారు. సంక్రాంతి సందర్భంగా అందరి ఇంటి ముంగిళ్లలో ముత్యాల ముగ్గులు వేసుకోవడానికి కావాల్సిన 10 రకాల రంగులు, ముగ్గుపిండిని ప్రత్యేక ప్యాకెట్ల ద్వారా ట్రస్ట్ తరపున పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు, ఆర్యవైశ్య నేతలు సునీల్, ప్రసాద్, మహిళా నాయకురాలు ఉదయగిరి సౌందర్యలహరి తదితరులు పాల్గొన్నారు. అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉచిత బస్సులు ఏర్పాటు చేసిన చైత్రను వారు ఘనంగా సత్కరించారు.

## దౌర్జన్యంగా మొక్కలు పీకేశారు

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



పొలంలో మొక్కలు తొలగించారని చూపెడుతున్న బాధితులు - మొక్కలు తొలగించిన దృశ్యం

వీరబల్లి, జనవరి10: సానిపాయి పంచాయతీ జింక హరిజనవాడకు చెందిన నాగమ్మ, రామక్క భూముల్లోని మామిడి మొక్కలను కుందేటివారిపల్లె వాసులు కుందేటి పాపయ్య, బాలయ్య దౌర్జన్యంగా తొలగించారని బాధితులు వాపోయారు. కొన్నేళ్లగా తమ అనుభవంలో భూమి ఉందని అందులో మామిడి చెట్లు కూడా నాటారని తెలిపారు. కాగా రెండు రోజుల కిందట భూముల్లోని 75 మామిడి మొక్కలను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దార్, కలెక్టర్‌కు విన్నవించుకున్నా ఏ మాత్రం తమ పట్ల దయ కూడా చూపలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఎంతో నిరుపేదలమని, చిల్లిగవ్వ కూడా భూమిలేదని ఈ భూమి ఆధారంగా జీవిస్తున్నామన్నారు. వారు ఇలా పలుసార్లు తమపై దౌర్జన్యం చేస్తున్నారని సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని తమ అనుభవంలో ఉన్న భూమికి పట్టా ఇవ్వాలని తొలగించిన మామిడి చెట్లకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

## వెహికల్ బాడుగ ఇవ్వాల్సిందే

● ఆడుదాం ఆంధ్రాలో తంతు

ఖాజీపేట, జనవరి 10: ఆడుదాం ఆంధ్రాలో మొదటి రోజు నుంచి ఏదో ఒక తతంగం జరుగుతూనే ఉంది. బుధవారం 17 జట్లకు క్రికెట్ పోటీలు జరగాల్సి ఉండగా 16 జట్లకు పోటీలు నిర్వహించారు. ఇందులో ఖాజీపేట-1 పంచాయతీ గెలిచింది. కొత్తపల్లె బ్యాచ్‌ను గురువారం రావాలని ఎంపీడీఓ చెప్పడంతో వారు వెళ్లిపోయారు. సాయంత్రం అరగంట సమయం ఉందని, గెలిచి వెళ్లిపోయిన జట్టును తిరిగి రావాలని హుకుం జారీ చేశారు. అయితే వారు వాహనంలో గ్రౌండ్‌కు రాగా మరో బ్యాచ్ రాలేదని తిరిగి మీరు గురువారం రావాలని చెప్పడంతో ఎంపీడీఓతో ఖాజీపేట బ్యాచ్ గొడవకు దిగింది. మాకు వెహికల్ బాడుగ ఇవ్వాల్సిందేనని మొండిపట్టు పట్టడంతో ఎంపీడీఓ ఏమీ చేయలేక కొద్దిమేర నగదు చెల్లించినట్లు సమాచారం. ఏది ఏమైనా ఆడుదాం ఆంధ్రాపై అధికారులకు అవగాహన లేకపోవడంతో ఇలా జరుగుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

## ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

పాపిరెడ్డిపల్లెలో విషాదఛాయలు



గంపా శ్రీనాథ్ (ఫైల్)

బ్రహ్మంగారిమఠం, జనవరి 10: పాపిరెడ్డిపల్లె వాసి గంపా వెంకటేశ్ కుమారుడు గంపా శ్రీనాథ్ (20) ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ విద్యాసాగర్ అందించిన వివరాల్లోకెళితే.... శ్రీనాథ్ డిగ్రీ వరకు చదివి, ఆర్మీ ఉద్యోగాల కోసం ఇటీవల ప్రయత్నం చేశాడు. ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారని ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. విషయం తెలుసుకున్న బి.మఠం ఎస్ఐ వారి బృందం సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి వివరాలపై ఆరా తీశారు. మృతుడు తండ్రి కూడా ఇటీ వలే మృతి చెందాడని తెలిపారు. మృతునికి తల్లి, సోదరుడు, సోదరి ఉందని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని బద్వేలుకు తరలించినట్లు తెలిపారు.

## రాజారెడ్డి వీధిలో చోరీ

● రూ. 2లక్షల మేర బంగారం, వెండి నగల అపహరణ

కడప (క్రైం), జనవరి 10: కడప నగరం రాజారెడ్డి వీధిలోని ఓ ఇంట్లో దొంగలుపడి బంగారు నగలు, వెండి దోచుకెళ్లారు. రాజారెడ్డి వీధి వాసి అబ్దుల్లా గత నెల 24న కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరు వెళ్లారు. తిరిగి బుధవారం ఇంటికొచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని వస్తువులు చెల్లాచెదురై ఉండడంతో బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదారు రూ.240వేల విలువైన బంగారు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## వాహనం సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం



వాహనం, ఎర్రచందనం దుంగలతో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది

పీలేరు, జనవరి 10: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న వాహనం సహా 8 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్ఓ జేవీ సుబ్బారెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి 10 గంటల నుంచి చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కొత్తపేట వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. బుధవారం ఉదయం 4 గంటలకు రొంపిచెర్ల వైపు నుంచి వేగంగా వచ్చిన ఏపీ39 హెచ్‌ఈ 1373 మహీంద్రా కారు ఆగకుండా ముందుకు వెళ్లిపోయిందన్నారు. దానిని వెంబడించగా గంగాధరనెల్లూరు మండలం కొత్త వెంకటాపురం వద్ద కారులోని వ్యక్తులు దానిని వదిలి పారిపోయారన్నారు. కారును తాము తనిఖీ చేస్తే అందులో 208 కేజీలు బరువున్న 8 ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. కారు సహా దుంగలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడిలో ఎఫ్ఆర్ఓ వెంకటరమణ, ఎఫ్‌బీఓ ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

## 10 మంది కోడిపందెగాళ్లు అరెస్టు

ములకలచెరువు, జనవరి 10: కాలువపల్లె వద్ద కోడి పందెం శిబిరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు. 10 మంది కోడిపందెగాళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు. వీరి నుంచి రూ.13,100 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ మనోహర్, సిబ్బంది కుమార్, వెంకటేశ్, సిరాజ్, హరి, అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

## వనరులను సద్వినియోగం చేసుకుని గొప్పవారిగా ఎదగాలి




సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ - సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 10: విశ్వవిద్యాలయ వనరులను సద్వినియోగం చేసుకుని గొప్పవారిగా ఎదగాలని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ పేర్కొన్నారు. వైవీయూ ఏపీజే అబ్దుల్‌కలాం ప్రాంగణలో నూతన విద్యార్థులకు నిర్వహించిన పరిచయ ప్రేరణలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఒక ప్రత్యేకత కలిగిన విశ్వవిద్యాలయం వైవీయూ జాతీయ విద్యావిధానం 2020 అమలు చేస్తున్నామని జ్ఞాన నైపుణ్య, ప్రయోగ ఆధారిత విద్య అందిస్తున్నామన్నారు. విద్యార్థులంతా వైవీయూను ఎంపిక చేసుకోవడమే తమ ప్రగతి దశగా వెళుతున్నట్లు తెలిపారు. నేర్చుకోవడానికి ఉన్న అన్ని అవకాశాలు ఇక్కడ లభిస్తాయన్నారు. క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని పోటీ ప్రపంచానికి తగ్గట్లు చదువులు, ఆలోచనలు సాగించాలన్నారు. గ్రంథాలయంలో వేల పుస్తకాలు జర్నల్స్ ఉన్నాయని నిపుణులైన అధ్యాపకుల, పరిశోధకుల సహకారం అందుకోవడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ సమాజ అవసరాలకు తగ్గ నైపుణ్యాలు అందించే బోధన శిక్షణ ఇక్కడ అందుతోందన్నారు. కడప జైళ్ల సూపరింటెండెంట్ ప్రకాశ్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో చదివే విద్యార్థులందరూ ఇక్కడి నుంచి ఉన్నత స్థాయిలోకి వెళ్లేలా రెండేళ్ల ప్రణాళికలు తయారు చేసుకుని అమలు చేసుకోవాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసరు డాక్టర్ సరిత, సునీత, ప్రొఫెసరు రియాజున్నీసా, అణు ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎద్దులబండి ఢీకొని వ్యక్తి మృతి



రవిరాజు ఫైల్ ఫొటో

రాజుపాలెం, జనవరి 10: తొండలదిన్నె వాసి గాలి పోతుల రవిరాజు (59) ఎద్దులబండి ఢీకొనడంతో మృతి చెందినట్లు ఏఎస్ఐ సిద్దయ్య తెలిపారు. తండ్రి భూషణంతో కలిసి పొలం పని నిమిత్తం బుధవారం రవిరాజు ద్విచక్రవాహనంలో వెళుతుండగా టంగుటూరు, తొండలదిన్నె గ్రామాల మధ్య ఎద్దులబండిని తప్పించబోయి రవిరాజు బండి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన అతన్ని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులున్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి



సిద్ధయ్య మృతదేహం

ముద్దనూరు,జనవరి10: కోనాపురం రైతు చెప్పలి సిద్ధయ్య(40) బుధవారం పొలంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఉప్పలూరు పొలంలో కూరగాయల పంటకు వ్యవసాయ బోరు వేసి నీళ్లు కడుతున్నాడు. ఉన్నట్లుండి మోటరు ఆగిపోవడంతో స్టార్టర్ వద్దకు వెళ్లి పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య హసీన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## ప్రమాదవశాత్తు ....



పెద్దిరెడ్డి పుల్లారెడ్డి మృతదేహం

కలసపాడు, జనవరి 10: సిద్ధమూర్తిపల్లెలో రైతు పెద్దిరెడ్డి పుల్లారెడ్డి (50) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పొలంలో బోరు బిగిస్తుండగా చైన్ పుల్లి విరిగి తల మీద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో పోరుమామిళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈయనకు చంద్రహాసరెడ్డి అనే కుమారుడు, కుమార్తె, భార్య ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ ఘనమద్దిలేటి పరిశీలించి చేసి కేసు నమోదు చేశారు.

## పాతకక్షలతో వ్యక్తి దారుణ హత్య



ఓబులవారిపల్లె, జనవరి10: మండల కేంద్రంలో టీ బంకు వద్ద బుధవారం సాయంత్రం దారుణహత్య జరిగింది. కటికంవారిపల్లె వాసి కటికం చంటప్పగారి చెంగయ్య (50) పాతకక్షలు కారణంగా దారుణహత్యకు గురయ్యాడు. గాదెల రోడ్డుకు వెళ్లే సర్కిల్ వద్ద ఉన్న మర్రిచెట్టు ప్రాంతంలో టీ బంకు వద్ద నిత్యం రద్దీగా ఉంటుంది. చెంగయ్య టీ బంకు వద్ద ఉండగా అదును చూసి గుర్తు తెలియని దుండగులు వేట కొడవలితో దాడి చేయడంతో ఒకసారిగా కుప్పకూలిపోయాడు. ఊపిరితో ఉన్న అతన్ని పోలీసులు చికిత్స నిమిత్తం రాజంపేటకు తరలించినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య బతు కుదెరువు కోసం గల్ఫ్‌దేశాల్లో ఉంది. మృతుడికి నిందితులకు పాతకక్షలు ఉండేవని గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేస్తామని ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

## స్థలవివాదంలో వ్యక్తిపై దాడి

కడప (క్రైం), జనవరి 10: వైఎస్ఆర్ కాలనీలో ఓ స్థల వివాదమై చలమారెడ్డిపల్లెకు చెందిన హనుమంతుపై వైసీపీ 2వ డివిజన్ కార్పొరేటరు అనుచరులు దాడికి పాల్పడ్డారు. గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి బాధితులతో కలిసి చిన్నచౌకు స్టేషన్‌కు వచ్చి ఈ ఘటనపై సీఐ నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కాగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## స్కూటర్‌ను ఢీకొన్న బస్సు

ఖాజీపేట, జనవరి 10: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు కాశినాయన ఆశ్రమం వద్ద ప్రైవేటు బస్సు స్కూటర్‌ను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే... రోజూ బేల్దారి పనికి కడపకు వెళ్లి తిరిగి ఖాజీపేటకు వస్తుండగా పత్తూరు సమీపంలో స్కూటర్ రోడ్డు క్రాస్ అవుతుండగా ప్రైవేటు బస్సు ఢీకొనడంతో దుర్గం శివ, బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

## వేధింపుల కేసులో జైలుశిక్ష, జరిమానా

కడప (క్రైం), జనవరి 10: వరకట్నవేధింపుల కేసులో భర్తకు ఏడాది జైలుశిక్ష, ఐదు వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు కడప నెహ్రూనగరకు చెందిన అయూబ్‌ఖాన్‌కు 2018లో వివాహం జరిగింది. వివాహమైన కొన్ని ఏళ్ల వరకు అన్యోన్యంగా ఉన్నవారు అధిక కట్నం కోసం భార్యను వేధిస్తుండడంతో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2021లో వరకట్న కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో న్యాయాధికారి సాక్ష్యాలు విచారించగా నేరం రుజువవడంతో ఏడాది జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

## దాడిపై కేసు నమోదు

కలకడ, జనవరి 10: బాలయ్యగారిపల్లి పంచాయతీ యర్రయ్యగారిపల్లిలో బుధవారం ఇద్దరిపై దాడి జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. సంబేపల్లి మండలం దిగువసోమవరం వాసులు నాగేంద్ర, చంద్రయ్యనాయుడు రోడ్డుపై నడుచుకుని వెళుతుండగా యర్రయ్యగారిపల్లికి చెందిన ఆనంద అతని భార్య శశికళ వారిని దూషించి గాయపరచినట్లు తెలిపారు. చంద్రయ్యనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఆనంద నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ చెప్పారు.

## శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

13నుంచి 16వరకూ నగర వాసులకు సందడి

శిల్పారామం పరిపాలనాధికారి పి. శివప్రసాద్‌రెడ్డి



పాత్రికేయులతో మాట్లాడుతున్న శివప్రసాద్‌రెడ్డి

కడప (కల్చరల్) జనవరి 10: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని నగర రిమ్స్ సమీప శిల్పారామంలో 13వ తేదీ శనివారం నుంచి 16వ తేదీ మంగళవారం వరకూ (నాలుగురోజులు) సంక్రాంతి సంబరాలు పేరుతో కనువిందు చేసేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్టేట్ గెస్ట్ హౌస్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8-30 గంటల వరకూ భరతనాట్యం, కూచిపూడి, సినీ గీతాలు, జానపద నృత్య ప్రదర్శనలు, గంగిరెద్దులు, హరిదాసులు, తదితరాలను మిస్బా మూవీ సహకారంతో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. శనివారం ఉదయం 10 గంటలకు మహిళలకు ముగ్గుల పోటీలు, ఆదివారం సాయంత్రం 4 గంటలకు గాలిపటాల పోటీలు, సోమవారం సాయంత్రం 5 గంటలకు సంప్రదాయ వస్త్రధారణ పోటీలుంటాయన్నారు. ఇందులో 3 నుంచి 8 ఏళ్ల బాల బాలికలు పాల్గొనాల్సి వుంటుందన్నారు. నగర వాసులు సంబరాల కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు తరలిరావాలని కోరారు. వివరాలకు 8886652038ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో మిస్బా మూవీ పద్మాకర్, కొరియోగ్రాఫర్ రామ్, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడు, మద్యం బాటిళ్లతో ఎస్ఐ

సింహాద్రిపురం, జనవరి 10: బిదినంచెర్లలో అక్రమ మద్యం అమ్ముతున్న ఒకరి నుంచి 10 మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో వెళ్లి అతన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే 9121100613కు తెలిపితే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## వాహనం సహా ఎర్ర దుంగలు స్వాధీనం

పీలేరు, జనవరి 10: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న వాహనంతో సహా 8 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో జేవీ సుబ్బారెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కొత్తపేట వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా బుధవారం రొంపిచెర్ల వైపు నుంచి వేగంగా వచ్చిన ఏపీ39 హెచ్ఈ 1373 కారులో 208 కేజీలు బరువున్న 8 ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. కారుతో సహా దుంగలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో తనతో పాటు ఎఫ్ఆర్‌వో వెంకటరమణ, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది ప్రభుతేజ, చరణ్, మల్లిఖార్జున, సుబ్రహ్మణ్యం పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

## 10 మంది కోడిపందెం రాయుళ్ల అరెస్టు

ములకలచెరువు, జనవరి 10: మండలంలోని కాలువపల్లె సమీపంలో బుధవారం కోడి పందెం శిబిరంపై దాడులు చేసి 10 మంది కోడిపందెంరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.13,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ మనోహర్, సిబ్బంది కుమార్, వెంకటేస్, సిరాజ్, హరి, అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

## 20లీటర్ల సారా స్వాధీనం..వ్యక్తి అరెస్ట్

నిమ్మనపల్లి, డిసెంబరు 10: గుట్టుచప్పుడు కాకుండా నాటు సారాను విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకొని అతని వద్ద నుంచి 20లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కొండయ్యగారిపల్లె గ్రామంలో చింతచెట్లు కింద నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి రవి(60)అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 20లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

## దాడిపై కేసు నమోదు

కలకడ, జనవరి 10: మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతి యర్రయ్యగారిపల్లిలో బుధవారం ఇరువురు వ్యక్తులపై దాడి జరిగిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పే స్వామి తెలిపారు. ఆయన వివరాల మేరకు సంబేపల్లి మండలం దిగువసోమవారంకు చెందిన నాగేంద్ర, చంద్రయ్యనాయుడు రోడ్డుపై నడుచుకుని వెళుతుండగా యర్రయ్యగారిపల్లికి చెందిన ఆనంద అతని భార్య శశికళ వారిపై దాడిచేసి గాయపరచినట్లు తెలిపారు. చంద్రయ్యనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మరో వర్గంలోని ఆనంద నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ చెప్పారు.

## బాల కార్మికులను పనుల్లో పెట్టుకోరాదు

మదనపల్లె టౌన్, జనవరి 10: బాల కార్మికులను పనుల్లో పెట్టుకోరాదని పారా లీగల్ వలంటీర్ సుభద్ర పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పలు దుకాణాలు, వాణిజ్య సముదాయాల వద్ద మండల న్యాయసేవా సహాయ సంస్థ ఆదేశాల మేరకు బాల కార్మికులు ఉన్నారేమో అని పలు చోట్ల తనిఖీలు చేశారు. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా బాల కార్మికుల నిర్మూలనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. 14 ఏళ్లలోపు పిల్లను పనుల్లో పెట్టుకోకూడదని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బాలజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## దారి ఆక్రమణపై తహశీల్దార్‌కు ఫిర్యాదు



తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎల్లంకీవారిపల్లె దళితులు

కలకడ, జనవరి 10:పశలమంద దారి ఆక్రమణకు గురైందని ఎర్రకోటపల్లె పంచాయతీ ఎల్లంకీవారిపల్లె దళితవాడ గ్రామస్థులు బుధవారం తహశీల్దార్ ప్రదీప్‌కు ఫిర్యాదు చేశారు. చాలా ఏళ్లగా సంక్రాంతి పండుగ సందర్భంగా చిట్లాకుప్ప వద్దకు పశువులను ఆ మార్గంలోనే తోలుకు వెళుతునట్లు తెలిపారు. అయితే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దారికి ముళ్ల కంపలను అడ్డంగా వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని తహశీల్దార్‌కు విన్నవించుకున్నారు.

## ముదివేడు ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి



బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

కురబలకోట, జనవరి 10: మండలంలోని ముదివేడు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జిల్లా ఎస్పీ కృష్ణారావు అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పలువురి ఎస్ఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న మల్లికార్జునరెడ్డిని ముదివేడుకు బదిలీ చేశారు. కాగా ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ ముబీన్‌తాజ్‌ను రాయచోటి అర్బన్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైన ఉపేక్షించేది లేదన్నారు. అలాగే మండల పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేపడితే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

## లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు



అర్బన్ హెల్త్ సెంటర్లో సిబ్బందికి సూచనలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ

మదనపల్లె టౌన్, జనవరి 10: స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని, ప్రతి ఒక్కరి స్కానింగ్ రిజిస్టర్‌లో రాయాలన్నారు. అనంతరం రామారావు కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. అవుట్ పేషెంట్‌లుగా వచ్చే వారిలో క్షయ లక్షణాలు కనిపిస్తే వారికి పరీక్షలు నిర్వహించాలన్నారు. 2025 లోపు టీబీ రహిత దేశంగా మలిచేందుకు వైద్యసిబ్బంది పనిచేయాలన్నారు. ఫ్యామిలి ఫిజీషన్ కార్యక్రమం, ఎన్‌సీడీసీడీ సర్వే చేయాలన్నారు. క్షయ వ్యాధి బాధితులకు గుర్తింపుకార్డు ఇస్తూ వారికి డాట్స్ పద్ధతిలో మందులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సల్మాన్, కీర్తిప్రియ, మోహిత్, విష్ణువర్ధన్, టీబీ సూపర్‌వైజర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నోటీసులిచ్చినా.. సమ్మె విరమించం



తంబళ్లపల్లెలో సర్వమత ప్రార్థనలు చేస్తున్న అంగన్వాడీలు



మదనపల్లె ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్వాడీలు



బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

మదనపల్లె టౌన్, జనవరి 10: తమన్యాయమైన డిమాండ్లను పరిష్కరించమంటే షోకాజ్ నోటీసులు ఇస్తారా? అయినా బెదిరేది లేదు..సమ్మె విరమించేది లేదంటూ అంగన్వాడీలు నినదించారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు 30వ రోజు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణా ప్రభుత్వం పెంచిన రీతిలోనే తమకు కూడా వేతనాలు పెంచాలని, గౌరవ వేతనం బదులు కనీస వేతనం ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు గ్రాట్యుటీ చెల్లించాలని అంగన్వాడీ సెంటర్లకు నాణ్యమైన పౌష్టికాహారం సరఫరా చేయాలని తాము సమ్మె చేసిన రోజులన్నింటికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాళ్లు మధురవాణి, రాజేశ్వరి, గంగాదేవి, సుజన తదితరులు పాల్గొన్నారు.

**తంబళ్లపల్లెలో:** తమ న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 30వ రోజుకు చేరింది. తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు, సహాయకురాళ్లు తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో బైఠాయించి రిలే నిరాహారదీక్ష చేపట్టారు. అనంతరం సమ్మె శిబిరానికి సమీపంలో ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలని సర్వమత ప్రార్థనలు చేసి దేవుళ్లకు మొక్కుఉన్నారు. అంగన్వాడీలు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల అంగన్వాడీ వర్కర్లు, సహాయకురాళ్లు పాల్గొన్నారు.

**వాల్మీకిపురంలో:** ప్రభుత్వానికి అంగన్వాడీ కార్యకర్తలంటే మరీ చులకన భావంగా తయారైందని వాల్మీకిపురంలో అంగన్వాడీ కార్యకర్తలు ధ్వజమెత్తారు. 30వ రోజు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట రోడ్డుపై ఎండలో వినూత్నంగా 30 నెంబర్ ఆకృతిలో అంగన్వాడీలు నిరసనలు తెలిపారు. ఈసందర్భంగా యూనియన్ లీడర్లు మాట్లాడుతూ గత నెల రోజులుగా అంగన్వాడీలు కనీస వేతనాలు, గ్రాట్యుటీ తదితర డిమాండ్ల సాధన కోసం పోరాడుతుంటే సీఎం జగన్‌కు కనీసం చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమపై ఎన్ని జీవోలు ప్రయోగించినా అది వైసీపీ ప్రభుత్వానికే చేటన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ లీడర్లు చంద్రావతి, భూకైలేశ్వరి, ప్రసన్న, అమ్మాజీ, దేవసేన, రెడ్డిరాణి, నరసమ్మ, లక్ష్మీనరసమ్మ, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలికిరి మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

**బి.కొత్తకోటలో** : అంగన్వాడీల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోందని అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు రాజేశ్వరి ధ్వజమెత్తారు. తమ డిమాండ్ల సాధన కోసం బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న ధర్నా బుధవారం 30 వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా నాయకురాలు రాజేశ్వరి ధర్నాలో పాల్గొని మాట్లాడుతూ జీవో నంబర్ 2 అంగన్వాడీ కార్యకర్తలకు వర్తిస్తుందా అని ప్రశ్నించారు. మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి. తక్షణమే విధుల్లో చేరుతామన్నారు. ప్రాజెక్టు యూనియన్ లీడర్ శ్రీవాణి మాట్లాడుతూ సమ్మె కీలక దశకు చేరుకున్న సమయంలో అంగన్వాడీ కార్యకర్తలందరూ హక్కుల సాధన కోసం ఏకతాటిపై నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మూడు మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ ద్వారా భూగర్భ జలాల పరిరక్షణ

- కేంద్ర భూగర్భ జల బోర్డు రీజినల్ డైరెక్టర్ కృష్ణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

కలికిరి, జనవరి 10: ఒక్క నీటి చుక్క కూడా నీరు వృథా కాకుండా భూగర్భ జలాలను గరిష్ట స్థాయిలో పరిరక్షించుకునే విధంగా ఉపాధి హామీ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర భూగర్భ జల బోర్డు రీజినల్ డైరెక్టర్ జి. కృష్ణమూర్తి స్పష్టం చేశారు. కేంద్ర భూగర్భ జల బోర్డు ఆధ్వర్యంలో జిల్లా నుంచి ఎంపిక చేసిన 120 మంది ఉపాధి హామీ సిబ్బందికి కలికిరి సీఎల్ఆర్సీ కేంద్రంలో బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో తరచూ తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటూ కరువు పీడిత ప్రాంతాలుగా గుర్తించిన చిత్తూరు, కడప, అనంతపురం, ప్రకాశం జిల్లాలతోపాటు అన్నమయ్య జిల్లాలను కార్యాచరణ కోసం ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఐదింటినీ జలశక్తి అభియాన్ జిల్లా లుగా గుర్తించినట్లు ఆయన వివరించారు. అనేక అంశాల ప్రాతిప దికగా ఈ ఐదు జిల్లాలను కేంద్ర ప్రభుత్వం ఎంపికచేసిందని జల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాల నిర్వహణ అభివృద్ధి కోసం ఉపాధి హామీ పథకం ద్వారా స్థానిక వనరులు, పనులు, వర్షపాతం, కూలీల నైపుణ్యత తదితర అంశాల ఆధారంగా ఏ విధమైన పనులు చేపట్టాలో చర్చించి నిర్ణయించాల్సి ఉందన్నారు. ఉపాధి హామీ ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి కార్యచరణ రూపొందించాలని కృష్ణమూర్తి కోరారు. పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం, మదనపల్లె నియోజకవర్గంలోని మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల ఉపాధి హామీలో పనిచేసే ఇంజినీరింగ్, టెక్నికల్ అసిస్టెంట్లు, పీవోలతోపాటు జిల్లాలోని ఇతర మండలాల నుంచి ఎంపిక చేసిన 120 మందితో ఈ అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో కేంద్ర భూగ ర్భ జల బోర్డు ఏపీ (విశాఖపట్నం) యూనిట్ ఇన్‌చార్జి గుమ్మా రవి కుమార్, సైంటిస్టులు వీఆర్ రాణి, మోనిక, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఓబులేశు, హైదరాబాద్‌కు చెందిన ఎస్ఆర్ శరత్, జిల్లా డ్వామా పీడీ మద్దిలేటి, ఏపీడీ నందకుమార్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.


## నిరుద్యోగులను మభ్యపెట్టేందుకే గ్రూప్-2 నోటిఫికేషన్



మాట్లాడుతున్న తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు అరుణ్‌తేజ

మదనపల్లె టౌన్, జనవరి 10: రాష్ట్రంలోని నిరుద్యోగులను, యువతను మభ్య పెట్టేందుకు వైసీపీ ప్రభుత్వం గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు నాదెళ్ల అరుణ్ తేజ ఆరోపించారు. బుధవారం స్థానిక టీడీపీ పార్ల మెంట్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో అరుణ్‌తేజ్ మాట్లాడుతూ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రతి ఏటా జనవరి 1వ తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. మూడు నెలల్లో ఎన్నికలు వస్తున్న తరుణంలో నిరుద్యోగులను మళ్లీ మోసగించేందుకు గ్రూప్-2 నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. యువత వైసీపీని నమ్మే పరిస్థితిలో లేదన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చి, ఉద్యోగ, ఉపాధి కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అయూబ్‌బాషా, షేక్ బావాజాన్, ప్రణయ్‌రాయల్, శివకృష్ణ, రఘు, భాస్కర్, నజీబ్ పాల్గొన్నారు.

## జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి



మాట్లాడుతున్న బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రసాద్

ములకలచెరువు, జనవరి 10: నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని బీఎస్పీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి సిద్ధగళ్ళ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 12వ తేదీన ములకలచెరువులో జరిగే ఒక్క రోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ములకలచెరువులో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను నట్టేట ముంచిందని దీనికి నిరసనగా బీఎస్పీ ఆధ్వ ర్యంలో ఒక్క రోజు నిరాహారదీక్షను చేపట్టామన్నారు.

## రీజియన్‌లో వన్ డిపో మొదటిస్థానం

మదనపల్లె అర్బన్, జనవరి 10: రీజియన్‌లో మదనపల్లె వన్ డిపో ఓఆర్ 69 శాతం సాధించి మొదటిస్థానంలో, ఈపీకే 37రూపాయలు సాధించి రెండవ స్థానంలో నిలిచిందని వన్‌డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం గేట్‌మీటింగ్ నిర్వహించి ఆర్టీసీ ఉద్యోగులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సంక్రాంతికి దూర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసుల నడుపుతున్నామన్నారు. అసిస్టెంట్ మేనేజరు రేవతి, రవి, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలపై అవగాహన

పెద్దమండ్యం, జనవరి 10: మండలంలోని సిగొల్లపల్లి, రామానాయక్ తాండాలలో కేంద్ర పథకాల గురించి బుధవారం అవగాహన కల్పించారు. మండలంలో కేంద్ర వికసిత్ భారత్ యాత్ర సాగింది. ఆయా గ్రామాలలో కేంద్ర ప్రభు త్వ పథకాలు పై ప్రచారం నిర్వహించారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మనోహర్ గౌడ్, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఎంఈవో మనోహర్, డీటీ గౌరిశంకర్, ఏవో సురేష్‌బాబు, ఆర్‌డబ్ల్యూఏఈ హరిప్రసాద్, ఏపీవో మురళి, ఈవోఆర్డీ జనార్ధన పాల్గొన్నారు.

## నేడు టీడీపీ సమావేశం

గుర్రంకొండ, జనవరి 10:తెలుగుదేశం పార్టీ సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు జగదీష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 24న పీలేరు జరిగే రా కదలిరా కార్యక్రమంపై చర్చించనున్నట్లు తెలిపారు.

## నియోజకవర్గాల వారిగా అభ్యర్థుల ఎంపిక

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగోతు రమేష్‌నాయుడు




మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్రకార్యవర్గసభ్యుడు రమేష్‌నాయుడు

మదనపల్లె అర్బన్, జనవరి 10: రాష్ట్రంలో నియోజకవర్గాల వారిగా బీజేపీ అభ్యర్థుల ఎంపిక చేపట్టబోతున్నామని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగోతు రమేష్‌నాయుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పోటీ చేయనున్న అభ్యర్థుల జాబితాపై బీజేపీ రాష్ట్ర అధినాయకత్వం అభిప్రాయసేకరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున్న వైసీపీ నాయకులు, ప్రతిపక్ష నాయకులు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. జగన్ అధికారంలోకి రాకమునుపు ఏ వర్గాలను నమ్మించి హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకున్నారో.. అధికారం దక్కాక ఆ వర్గాలను విస్మరించడం, వారికి ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ భగవాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల కృష్ణమూర్తి, సీటీఎం రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యుడు జేకే వర్మ, పూలనాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

బి.కొత్తకోట జనవరి 10 : గ్రామస్థాయి క్రీడా పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు మండల స్థాయి పోటీలు బి.కొత్తకోటలో బుధవారం ప్రారంభమయ్యాయి. నగర పంచాయతీ కమిషనర్ పీఎస్ మనోహర్, ఎంపీడీవో శంకరయ్యలు ప్రారంబించి వివిధ క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉండికూడా మరుగున పడిన క్రీడాకారులను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు ఘననివాళి

బి.కొత్తకోట జనవరి 10 : బి.కొత్తకోట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు ఎంపీడీవో శంకరయ్య, ఎంఈవో రెడ్డిశేఖర్‌లు బుధవారం నివాళులర్పించారు. ఈ ఈ నెల 29న విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 135 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో అన్ని మండల కేంద్రాల్లో అంబేడ్కర్‌కు నివాళులర్పించడంతో పాటు, ఆయన జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్. సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా సప్పలమ్మ విగ్రహప్రతిష్ఠ

మదనపల్లె అర్బన్, జనవరి 10: సీటీఎం క్రాస్ రోడ్‌లో వెలసిన సప్పలమ్మ ఆలయంలో బుధవారం అమ్మవారి విగ్రహప్రతిష్ఠ, కుంభాభిషేకం అత్యంతవైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా హోమాలు నిర్వహించి బుధవారం సప్పలమ్మ విగ్రహప్రతిష్ఠ కావించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరమ్మ, అక్కులప్ప, వెంకటరమణ పాల్గొన్నారు. కొత్తపేట, ఇందిరమమ కాలనీ, క్రాస్‌రోడ్డు, పాకాలమంద, సోమలగడ్డ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వారపు సంతలో సంక్రాంతి సందడి

కలకడ, జనవరి 10:సంక్రాంతి పండుగ ముందుగా కలకడలో బుధవారం జరిగిన వారపు సంతలో జనాలతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సంతకు కలికిరి, సంబేపల్లె, కేవీపల్లె, కలకడ మండలాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి తమకు కావాల్సిన సరుకులను కొనగోలు చేశారు. ఈ సందర్భంగా పూజా సామగ్రి, దుస్తులు, కూరగాయలు, రంగుల దుకాణాలు, పశు అలంకరణ సామగ్రితో కూడిన అంగళ్లు కిక్కిరిశాయి. వ్యాపారులు వారు సంతలో సరుకులను అమ్ముకొడానికి పోటీలు పడి కొనుగోలుదారులను ఆకర్షించారు.

## పండుగ కానుకలు రద్దు చేయడం దుర్మార్గం

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి



రాజీవ్ నగర్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, జనవరి 10: సంక్రాంతి, క్రిస్మస్, రమజాన్ పండుగల సందర్భంగా గత టీడీపీ ప్రభుత్వం అందజేస్తూ ఉండిన పథకాలను రద్దు చేయడం దుర్మార్గ మని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పీలేరులో బుధవారం ఆయన టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి రాజీవ్ నగర్ కాలనీ, శ్రీనాథపురం కాలనీల్లో "బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలతో మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రమజాన్, సంక్రాంతి, క్రిస్మస్ పండుగల సందర్భంగా నిత్యావసర సరుకులతో కూడిన కానుకలు అందజేసేవారని గుర్తు చేశారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత వాటిని రద్దు చేసి నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెంచేశారని, దాంతో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో పండుగ సంతోషం లేకుండాపోయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా వైసీపీకి బుద్ధి చెప్పేందుకు టీడీపీ, జనసేనకు మద్దతు తెలపాలని కోరారు. ఉమ్మడి అభ్యర్థిగా పీలేరు నియోజకవర్గంలో పోటీ చేస్తున్న తనను ఆదరించాలని ప్రజలను కోరారు. అనంతరం 'సూపర్ సిక్స్' పథకాలతో కూడిన కరపత్రాల ద్వారా వాటి గురించి వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

### 'రా...కదిలిరా' బహిరంగ సభను విజయవంతం చేయాలి

'రా...కదిలిరా' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24వ తేదీన పీలేరులో జరగనున్న టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి టీడీపీ శ్రేణులను కోరారు. చంద్రబాబు సభ కోసం పీలేరు-మదనపల్లె మార్గంలోని వేపులబైలు వద్ద ఎంపిక చేసిన స్థలాన్ని బుధవారం ఆయన పీలేరు నియోజకవర్గ పరిశీలకులు సూరా సుధాకర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాలకు చెందిన టీడీపీ శ్రేణులు, అనుబంధ సంఘాల సభ్యులు, నందమూరి, నారా కుటుంబ అభిమానులు, జనసేన శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, షౌకత్‌అలీ, అమరనాథరెడ్డి, మల్లెల రెడ్డిబాషా, అత్తార్ చాన్‌బాషా, పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, యల్లెల రెడ్డప్పరెడ్డి, బీసీ రమణ, సురేశ్, శీన, గాంధీ, పిళ్ల, వసంతాల రాజా, అబూబకర్, వెంకటేశ్, ప్రతాప్ రెడ్డి, జనసేన నాయకులు ఖలీద్, గజేంద్ర, పవన్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింలను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం

కలికిరి, జనవరి 10: ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి చివరికి వాటిని గాలికి వదిలేసి మైనారిటీ ముస్లింలను సీఎం జగన్మోహన్‌రెడ్డి మోసం చేశారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి వివరించారు. బుధవారం ఆయన పల్లవోలు పంచాయతీ గడి గ్రామంలోని మైనారిటీ ముస్లింల ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ఇస్తున్న హామీల గురించి వివరించారు. టీడీపీ ప్రభుత్వం ముస్లింలకు ఇస్తున్న రంజాన్ తోఫాను, దుల్హన్ పథకాన్ని రద్దు చేశారన్నారు. అనంతరం ఆయన పెద్దూరు, ద్వారకానగర్, తూర్పుపల్లె, పడమటపల్లె, లింగంపల్లె, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి బాబు గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలికిరి సర్పంచు ప్రతాప్‌కుమార్ రెడ్డి, వాసునూరి చంద్రశేఖర్, మైనారిటీ నాయకులు నిజాముద్దీన్, షాబుద్దీన్, కాశీం, జిన్నా, ఇస్మాయిల్, సలావుద్దీన్, మనోహర, రెడ్డెప్ప రెడ్డి, భాస్కర్ రెడ్డి, కేవీ రెడ్డి, రామలింగా రెడ్డి, హరిబాబు, సహదేవ రెడ్డి, సురేష్ రెడ్డి, సహదేవ, సురేష్‌కుమార్ రెడ్డి, పూర్ణచంద్ర, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర భవిష్యత్తు కోసం వైసీపీని తరిమి కొట్టండి



భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్

నిమ్మనపల్లి, జనవరి 10: రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే వచ్చే ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టాలని మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ ప్రజలను కోరారు. బుధవారం అగ్రహారం గ్రామ పంచాయతీలో టీడీపీ అందిస్తున్న భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు నాలుగున్నర ఏళ్లగా తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. సామాన్యుడు బతికే పరిస్థితి కనిపించలేదని నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కనీసం 1వ తారీకున జీతాలు చెల్లించలేని దయనీయ స్థితిలో జగన్ ప్రభుత్వం ఉందన్నారు. అలాగే అంగన్వాడీ, కార్యకర్తలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించి వారి జీవితాలపై దెబ్బ కొట్టారన్నారు. పంచాయతీల్లో పని చేసే కార్మికులకు 18నెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డెప్పరెడ్డి, సుధాకర్ రావు, మునిరత్నం, లక్ష్మన్న, మల్లప్ప, చినబాబు, విజయ్, మురళి, శంకర, జయరామ్, రెడ్డప్ప, తదితరుల పాల్గొన్నారు.

## టీడీపీతోనే బీసీలకు న్యాయం

గుర్రంకొండ, జనవరి 10:తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు సముచిత స్థానం కల్పించడం జరిగిందని రాజంపేట పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు హరిప్రసాద్ నాయుడు పేర్కొన్నారు. మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో బుధవారం ఆయన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అమలు చేయనున్న పథకాలు, మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. టీడీపీ ప్రభుత్వంతోనే పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో విజయకుమార్, వెంకటరమణ, రాజన్న, రమణ, చలపతి, రామాంజులు, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

## మహారాజ శ్యామల చండీ హోమం విజయవంతం



మాట్లాడుతున్న దొరస్వామినాయుడు

మదనపల్లె అర్బన్, జనవరి 10: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు సీఎం కావాలని ఆకాంక్షస్తూ నిర్వహించిన దశమహా విద్య సమేత మహారాజ శ్యామల చండీహోమం విజయవంతమైందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత కట్టాదొరస్వామినాయుడు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎం కావాలని తలపెట్టిన దశమహా విద్య సమేత మహారాజ శ్యామల చండీహోమం మూడు రోజులపాటు మదనపల్లె పట్టణంలో ఎస్‌వీఆర్ కళ్యాణమండపంలో వైభవంగా జరిగిందన్నారు. ఈ హోమం విజయవంతం చేయడంలో కృషి చేసిన టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, ప్రజలకు ఈసందర్భంగా ఆయన కృతజ్ఞతలు చెప్పారు. ఈ హోమం ఫలించి 2024లో నిర్వహించే సార్వత్రిక ఎన్నికల్లో విజయం సిద్ధించి నారాచంద్రబాబునాయుడు సీఎం కావాలని ఆయన కోరారు.

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండ్రెడ్డికి సన్మానం



టీడీపీ నేత కొండ్రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బి.కొత్తకోట జనవరి 10 : టీడీపీ రాష్ట్ర నూతన కార్యవర్గంలో రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన తంబళ్లపల్లెకు చెందిన కొండ్రెడ్డికి బుధవారం బి.కొత్తకోట మండలంలోని చలిమామిడి సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఘనంగా సన్మానించారు. స్థానిక నాయకుడు ప్రసాద్ ఆధ్వర్యంలో ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పూలమాలలు, దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కొండ్రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తనపై పెట్టిన నమ్మకాన్ని, వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తన మీద అభిమానంతో సన్మానించిన చలిమామిడి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శివారెడ్డి, సోము, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మల్లయ్యకొండ అభివృద్ధికి సహకారమందిస్తాం



గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్‌ను పరిశీలిస్తున్న సబ్ డీఎఫ్‌వో

తంబళ్లపల్లె, జనవరి 10: తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్య కొండను టూరిజంగా అభివృద్ధి పరచడానికి అటవీ శాఖ ఆధ్వర్యంలో సహకారం అందిస్తామని ఫారెస్ట్ సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం సబ్‌డీఎఫ్‌వో మల్లయ్యకొండను సందర్శించి భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొండపైన గౌరమ్మ కుప్ప వ్యూ పాయింట్, కోనేరు వద్ద క్వార్టర్స్‌కు ఎంపిక చేసిన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అభివృద్ధి పనులకు సంబంధించి అంచనా నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. తొందర్లోనే అభివృద్ధి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డి, ఎఫ్‌బీవోలు రెడ్డివరప్రసాద్, రామ్‌రాజు, సిబ్బంది ఉన్నారు.

## వేణుగోపాలస్వామి మాన్యంలో మంత్రి గన్‌మెన్ అక్రమ నిర్మాణం



వేణుగోపాల స్వామి మాన్యంలో నిర్మాణాలను పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారులు

చౌడేపల్లె, జనవరి10: చౌడేపల్లె బజారువీధిలోని వేణుగోపాల స్వామి ఆలయ మాన్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇద్దరు గన్‌మ్యాన్లు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. బుధవారం ఈ విషయం తెలుసుకున్న దేవదాయశాఖ గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి ఆ నిర్మాణాలను పరిశీలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈ ఆలయ భూములు చౌడేపల్లెతోపాటు, వివిధ గ్రామాల్లో ఉన్నాయి. చౌడేపల్లె బస్టాండు సమీపంలోని మాన్యం భూమికి డిమాండుతో పాటు విలువ కూడా అధికంగా ఉంది. దీంతో కొంతకాలంగా రాజకీయ అండదండలు ఉన్న వ్యక్తులు దురాక్రమణకు పాల్పడుతూనే ఉన్నారు. ఇక, మంత్రి పెద్దిరెడ్డికి గన్‌మేన్లుగా వ్యవహరిస్తున్న ఇద్దరు విలువైన ఆ మాన్యం భూమిపై కన్నేశారు. కొన్నిరోజులుగా వేణుగోపాలుడి మాన్యం భూమినే కబ్జా చేసి నిర్మాణాలు శరవేగంగా చేస్తున్నారు. ఇంతకాలం రెవెన్యూ, దేవదాయశాఖ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. కలెక్టర్ స్పందించి మాన్యం భూముల దురాక్రమణలను అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.

## కాశీవిశ్వేశ్వరస్వామి మాన్యంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు

### గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్

చౌడేపల్లె, జనబరి10:కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ మాన్యం భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్ పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో కాశీవిశ్వేశ్వరస్వామి మాన్యంలో అక్రమ నిర్మాణంపై కథనం రావడంతో తాము వచ్చినట్లు ఆయన తెలిపారు. మాన్యం భూమిలో అక్రమంగా 4 అంతుస్తుల భవనం నిర్మిస్తున్న వ్యక్తులతో మాట్లాడి నిర్మాణం ఆపేయాలని ఆదేశించారు. మాన్యం భూమిలో సుమారు 70 మందికి పైగా దురాక్రమణలు చేశారని, వారందరికీ దేవదాయ శాఖ ట్రిబ్యునల్ ఆదేశాలతో తదుపరి చర్యలు ఉంటాయన్నారు. అలాగే రెండు మూడు రోజులలో మాన్యం భూమిలో బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

## 22న తుది ఓటర్ల జాబితా విడుదల

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 10: తుది ఓటర్ల జాబితాను ఈనెల 22న విడుదల చేస్తున్నట్లు జిల్లా రెవిన్యూ అధికారి రాజశేఖర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. గతనెల 9వ తేదీ వరకు అందిన దరఖాస్తులకు సంబంధించిన విచారణ ఈనెల 12వ తేదీతో ముగుస్తుందన్నారు. 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రధాన కేంద్రాల్లో, విద్యాసంస్థల్లో ఓటర్ల అవగాహన కోసం ఈవీఎంల పనితీరును వివరిస్తూ ప్రదర్శన జరుగుతుందని వివరించారు. ఓటరు జాబితాలో తమ పేరు నమోదు కోసం ఓటర్లు దరఖాస్తులను నిరంతరం అందజేయవచ్చని, దానికి తుది గడువులేదని స్పష్టం చేశారు. పార్టీల ప్రతినిధులు సురేంద్ర కుమార్ (టీడీపీ), ఉదయ్‌కుమార్ (వైఎస్సార్‌సీపీ), గంగరాజు (సీపీఐ), అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ దూరవిద్య ప్రవేశానికి గడువు పొడిగింపు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 10: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ దూర విద్య డిగ్రీలో ప్రవేశానికి ముగిసిన గడువును ఈనెల 31 వరకు పొడిగించినట్లు సెంటర్ కోఆర్డినేటర్ మీరాసాహెబ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగి డిగ్రీ చదవాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఫిబ్రవరిలోగా లైఫ్ సర్టిఫికెట్లు అందించండి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 10: జిల్లాలోని సర్వీస్, ఫ్యామిలీ పెన్షనర్లు, ఇతర పెన్షనర్లు 2023-24 సంవత్సరానికి సంబంధించి లైఫ్ సర్టిఫికెట్లను ఫిబ్రవరి నెలాఖరులోగా అందజేయాలని జిల్లా ఖజానాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.రామచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని సబ్‌ట్రెజరీ కార్యాలయాల్లో లైఫ్‌సర్టిఫికెట్ల వివరాలను నమోదు చేయాలని, సాంకేతిక ఇబ్బందులు ఏర్పడితే నేరుగా కార్యాలయాలకు వచ్చి అందించాలన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఇన్‌కం ట్యాక్స్ రికవరీ సేవింగ్స్ ఫామ్‌లు, ఎంత మేర ట్యాక్స్ తగ్గింపు వర్తిస్తుందో అనే విషయాలు సమీప సబ్‌ట్రెజరీ అధికారిని కలిసితెలుసుకోవాలని సూచించారు.ఈనెల 20వ తేదీలోగా ఇన్‌కం ట్యాక్స్ రికవరీ వివరాలు సబ్‌ట్రెజరీ కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు.

## గణతంత్ర దిన వేడుకలకు పలమనేరు విద్యార్థి



ఇలవరసన్

పలమనేరు, జనవరి10: ఢిల్లీలో ఈనెల 26వ తేది నిర్వహించే గణతంత్ర దిన వేడుకల్లో పాల్గొనేందుకు పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఆర్.ఇలవరసన్ ఎంపికైనట్లు ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ టి. బాలాజి తెలిపారు. బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇలవరసన్ ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన ప్రీరిపబ్లిక్ క్యాంపుల్లో ప్రతిభ కనబరచి 35వ ఆంధ్ర బెటాలియన్ తరపున ఎంపికయ్యారని బాలాజి తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేసులు, వైస్ ప్రిన్సిపాల్ విజయశేఖరం మాట్లాడుతూ పలమనేరు గంటావూరు కాలనీకి చెందిన ఇలవరసన్ క్రమశిక్షణ కలిగిన విద్యార్థి అని, ప్రాథమికపరీక్షలో యూత్‌ఎక్చేంజ్ ప్రోగ్రామ్‌కు కూడా ఎంపికయ్యాడని, తుది పోటీల్లో ఎంపిక అవుతాడని ఆశిస్తున్నామని తెలిపారు.

## రూ.35లక్షల వెండి స్వాధీనం

గుడిపాల, జనవరి 10: గుడిపాల మండలం.. తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన ముస్తిరికుప్పం వద్ద బుధవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. బిల్లులు లేకుండా రూ.35లక్షలు విలువచేసే వెండిని తమిళనాడు నుంచి చిత్తూరుకు తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎన్నికల దృష్ట్యా ముస్తిరికుప్పంలో తనిఖీలు నిర్వహిస్తుండగా 49 కిలోల వెండి స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

**ఏడు నాటు తుపాకులు స్వాధీనం :** చిత్తపార గ్రామంలో బుధవారం పోలీసులు దాడులు నిర్వహించి ఏడు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. ఎవరి వద్దయినా నాటుతుపాకులుంటే స్వచ్ఛందంగా తెచ్చివ్వాలని, లేనిపక్షంలో తమ దృష్టికి వస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.



పెనుమూరులో జగనన్న టీషర్టులు చాలక సరిపోక సాధారణ దుస్తుల్లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు - సోమలలో ప్రభుత్వ దుస్తులను నిరాకరించిన కొందరు క్రీడాకారులు

# ఇదెక్కడి 'ఆడుదాం ఆంధ్రా' బాబోయ్!

- మండల స్థాయిలో పోటీలు ప్రారంభం
- గ్రామస్థాయిలోలాగే ఇక్కడా ముందుకురాని క్రీడాకారులు
- కొత్తవారితో రిజిస్ట్రేషన్లు
- తీవ్ర ఒత్తిడిలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు
- సరిపోని టీ షర్టులు, నాణ్యత లేని కిట్లు

చిత్తూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): 'ఆడుదాం ఆంధ్రా' పోటీల నిర్వహణతో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. బుధవారం నుంచి మండలస్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. గ్రామ స్థాయిలోలాగే ఇక్కడా క్రీడాకారుల నుంచి స్పందన పెద్దగా లేదు. ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ ప్రభుత్వం ప్రచారం కలిసొచ్చేలా 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని ప్రారంభించింది. సచివాలయాల స్థాయిలో పలురకాల ఆటలు ఆడించి, ఆ తర్వాత మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసేలా ప్లాన్ చేశారు. సరిపడా మైదానాలు లేక పొలాలనే చదును చేసి ఆడించారు. డిసెంబరు 26న తొలిరోజు నిర్వహించిన గ్రామ స్థాయి పోటీలకు క్రీడాకారులు, ప్రేక్షకుల నుంచి ఆదరణ కరువైంది. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు బలవంతంగా క్రీడాకారులు, ప్రేక్షకులను నమోదు చేశారు. ఆ తర్వాత జరిగిన పోటీల పరిస్థితీ అంతే. ఇక, బుధవారం నుంచి మండల స్థాయి పోటీలు మొదలుపెట్టారు. గ్రామ స్థాయిలో ప్రతిభ చూపించిన క్రీడా బృందాలను మండల స్థాయిలో ఆడించాల్సి ఉంది. అసలు చాలా చోట్ల గ్రామ స్థాయిలోనే పోటీలు జరగకపోవడంతో మండల స్థాయిలో ఆడేవారు కరువయ్యారు. దీంతో సచివాలయ ఉద్యోగులు మరోసారి క్రీడాకారుల్ని నమోదు చేయాల్సి వచ్చింది. బుధవారం తొలిరోజు మండల స్థాయి పోటీలు నిర్వహించగా, నాణ్యత లేని కిట్లతో.. సరిపోని టీషర్టులతో క్రీడాకారులు ఇబ్బంది పడ్డారు. మరికొందరు ఆ టీషర్టులు ధరించడానికి ఆసక్త చూపలేదు. దీంతో పెనుమూరు, సోమల తదితర మండలాల్లో సాధారణ దుస్తులతో పోటీల్లో పాల్గొన్నారు. పెనుమూరు మండలంలో 14 సచివాలయాలుండగా, 5 చోట్ల నుంచి క్రీడాకారులు మండల స్థాయి పోటీలకు రాలేదు. ఇదే పరిస్థితి అన్ని మండలాల్లోనూ ఉంది. జిల్లా వ్యాప్తంగా మండలాలు, మున్సిపాలిటీలను కలిపి 33 యూనిట్లుగా ఏర్పాటుచేసి మండల స్థాయి పోటీలను నిర్వహిస్తున్నారు. మండల స్థాయి పోటీల నిర్వహణకు 127 మైదానాలను సిద్ధం చేశారు. కొన్ని సచివాలయాల నుంచి మండల స్థాయి పోటీలకు జట్లు రాకపోయినా కొత్తవారితో నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన గ్రామ స్థాయి పోటీలకు 72820 మంది రిజిస్ట్రేషన్లు చేసుకోగా, 6120 మంది మాత్రమే పాల్గొన్నారు. ఈ లెక్కన చూసుకుంటే ఈ రిజిస్ట్రేషన్లన్నీ బలవంతంగా చేశారనే విషయం స్పష్టమవుతోంది.



కుప్పం టీడీపీ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేస్తున్న తెలుగు యువత నాయకులు

# నిరుద్యోగ యువతను మోసం చేశారు

- సీఎం జగన్‌పై కుప్పం, వెదురుకుప్పం పోలీసు స్టేషన్లలో తెలుగు యువత ఫిర్యాదు

కుప్పం, జనవరి 10: అధికారంలోకి రాగానే ఉద్యోగాలిస్తానని చెప్పి ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేశారంటూ ముఖ్యమంత్రి జగన్‌పై బుధవారం కుప్పం పోలీసుస్టేషన్‌లో తెలుగు యువత నాయకులు ఫిర్యాదు చేశారు. తెలుగుదేశం కార్యాలయం నుంచి ప్రదర్శనగా పోలీసు స్టేషన్ బయలుదేరిన నాయకులు, అక్కడ ఎస్ఐ సుబ్బారెడ్డిని కలిసి ఫిర్యాదు అందజేశారు. అధికారంలోకి రాగానే 2.5 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని, ఏటా జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పి నిలువునా నమ్మించి ముంచేశారని విమర్శించారు. సీఎంఐ ప్రకారం రాష్ట్రంలో 2019 నాటికి 4 శాతం ఉన్న నిరుద్యోగిత 2023 డిసెంబరు నాటికి 6.6 శాతానికి పెరిగిందన్నారు. ఉపాధి, ఉద్యోగాల్లేక రాష్ట్రంలో గత మూడేళ్లలో 21,575 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ జగన్‌రెడ్డి ప్రభుత్వం గంజాయి అక్రమ రవాణాలో ప్రథమస్థానంలో ఉన్నట్లు ఏసీబీ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో నివేదిక చెబుతోందన్నారు. మరోవైపు గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు బానిసలై ఏపీలో 571 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడినట్లు క్రైమ్ బ్యూరో నివేదికలో ఉందన్నారు. వీటన్నింటిపై విచారించి సీఎంపై చర్యలు తీసుకుని రాష్ట్ర యువతకు న్యాయం చేయాలని ఆ ఫిర్యాదులో పోలీసులను కోరారు. అంతకుముందు టీడీపీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు వెంకటేశ్, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, ప్రధాన కార్యదర్శి శంకర్, చలం, అశోక్, సుబ్బు, సుబ్రమణ్యం, రాజేంద్ర, వినోద్, గణేశ్, విజయ్, మనోహర్, బాలాజీ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

### వెదురుకుప్పం పోలీసులకూ ఫిర్యాదు

వెదురుకుప్పం: ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం జగన్ మోసం చేశారంటూ టీడీపీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు, తెలుగు యువత జీడీనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉద్యోగాలు, ఉపాధి లేక యువత ఎదుర్కొంటున్న సమస్యలను ఆ ఫిర్యాదులో పేర్కొని.. తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఆయనతో పాటు టీడీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బట్టే చాణిక్యప్రతాప్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు శివరాం యాదవ్, నాయకులు రాజశేఖర్‌వర్మ, వెంకటరమణారెడ్డి, మునిరాజారెడ్డి, నాగరాజు, రామచంద్ర ఉన్నారు.



## అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులు

- తీసుకోకపోవడంతో కేంద్రాలకు అతికించిన అధికారులు
- 30వ రోజున పిల్లల తల్లుల మద్దతు

చిత్తూరు, జనవరి 10: సమ్మెలో ఉన్న అంగన్వాడీలకు బుధవారం అధికారులు షోకాజ్ నోటీసులు ఇవ్వగా.. వీరు తీసుకోలేదు. అంగన్వాడీలపై ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించింది. ఈనెల 19వ తేదిలోపు విధుల్లో చేరకపోతే తొలగిస్తామని షోకాజ్ నోటీసులో పేర్కొంది. సమ్మెలో ఉండటం వల్ల 30 రోజులుగా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లలకు పోషకాహారం అందడం లేదని ఆ నోటీసుల్లో ప్రస్తావించారు. దీంతో వారంతా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. దైనందిన కార్యక్రమాలన్నీ ఆగిపోయినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు జిల్లా స్త్రీ-శిశు సంక్షేమశాఖ అధికారులు సిద్ధం చేసి సచివాలయ సిబ్బందికి అందించారు. వారంతా ఆయా కేంద్రాలకు వెళ్లి వర్కర్లకు ఇవ్వడానికి ప్రయత్నించగా వాళ్లెవరూ నోటీసులను తీసుకోలేదు. దాంతో చిత్తూరుతో పాటు మరికొన్ని చోట్ల కేంద్రాలకు షోకాజ్ నోటీసులను అంటించి వెళ్లిపోయారు. అంగన్వాడీ యూనియన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఒక్క వర్కర్‌కూడా బుధవారం షోకాజ్ నోటీసును తీసుకోలేదని నేతలు తెలిపారు.

### సమ్మెకు తల్లుల మద్దతు



కార్వేటినగరంలో అంగన్వాడీలకు మద్దతుగా నిరసనలో కూర్చున్న పిల్లల తల్లులు

కార్వేటినగరంలో బుధవారం పిల్లల తల్లులతో కలిసి అంగన్వాడీలు నిరసన తెలిపారు. వర్కర్లకు ప్రభుత్వం చేయాల్సిన పనులను చేసి పెడితే పిల్లలను కేంద్రాలకు పంపుతామని తల్లులు తెలిపారు. కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక రిలే నిరాహారదీక్ష ముగింపు దీక్ష జరిగింది. ఎస్మా చట్టాలను ప్రయోగించి భయపెడతామంటే సీఎం జగన్‌ను ఇంటికి పంపిస్తామని యూనియన్ నేతలు హెచ్చరించారు. పలమనేరులోని దీక్షాశిబిరంలో నిరసన కొనసాగించారు.

## ఎన్నికల సమావేశం రేపటికి వాయిదా

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 10: చిత్తూరులోని జడ్పీ మీటింగ్ హాలులో గురువారం ఉదయం 10 గంటలకు ఎన్నికల ఏర్పాట్లపై జరగాల్సిన సమావేశాన్ని అనివార్య కారణాలతో శుక్రవారానికి వాయిదా వేసినట్లు డీఆర్వో రాజశేఖర్ తెలిపారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కలెక్టర్ షన్మోహన్ అధ్యక్షతన పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనపై సమావేశం ఏర్పాటుచేశామన్నారు. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని ఇంజినీరింగ్ శాఖల ఈఈలు, డిప్యూటీ ఈఈలు, ఏఈలు, డీఈవో, సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్, ఇంజినీర్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెక్టోరల్ ఆఫీసర్లు, స్పెషల్ ఆఫీసర్లు తదితరులు శుక్రవారంనాటి సమావేశానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

## పంట పొలాలపై ఏనుగుల విధ్వంసం



కల్లూరు, జనవరి 10: మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీలో మంగళవారం రాత్రి పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. పులిచెర్ల నుంచి మంగళంపేటకు వెళ్లే మార్గమధ్యలో ముప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన శ్రీరాములురెడ్డి పొలంలోకి ప్రవేశించిన ఏనుగులు 20 అరటిచెట్లు, వేరుశనగ, తమలపాకు తోటను ధ్వంసం చేశాయి. సమీపంలోని శీరాములుగౌడుకు చెందిన 40 అరటి, 30 బొప్పాయి, 10 సపోటా చెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు బోరు మోటర్‌ను విరిచేశాయి. చిన్నబ్బకు చెందిన 10 కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. చిచ్చిలివారిపల్లిలోని ఉమామహేశ్వర్‌రెడ్డికి చెందిన 5 కొబ్బరిచెట్లు, వరినారు, డ్రిప్‌పైపులను ఏనుగులు ధ్వంసం చేశాయి. బాబురెడ్డికి చెందిన చెరకుతోటను, డ్రిప్ పైపులను ఏనుగులు ధ్వంసం చేశాయి.

## పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు అప్‌లోడ్ చేయండి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 10: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి ఈనెలాఖరులోగా ఈ గ్రామ సర్వర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీ, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికల తయారీపై జడ్పీ మీటింగ్ హాలులో జరిగిన రెండురోజుల శిక్షణ తరగతుల ముగింపు సమావేశం బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న పథకాల నిధుల లభ్యత అంచనా వేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకుని పెండింగ్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డీపీవో లక్ష్మి సూచించారు. జిల్లా వనరుల కేంద్ర సమన్వయకర్త షణ్ముగరామ్, పలమనేరు డీఎల్డీవో ఉమావాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బ్లాస్టింగ్‌తో ఇంటిపై పడిన రాళ్లు

- హైవే అధికారుల నిర్లక్ష్యంతో పగుళ్లిచ్చిన గోడలు



పగుళ్లు ఇచ్చిన ఇంటి గోడలు

గుడిపాల, జనవరి 10: గుడిపాల మండలం పసుమంద కాలనీలో బుధవారం రాత్రి రోడ్డు పనుల విస్తరణలో భాగంగా రాళ్ల పగలకొట్టడానికి బ్లాస్టింగ్ చేశారు. ఈ పేలుడితో రాళ్ల సమీపంలోని ఇంటిపై పడటంతో.. ఆ ఇంటి గోడకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందని, గతంలోనూ రెండు సార్లు ఇలాగే జరిగిందని గ్రామానికి చెందిన వినాయక బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఐ రామ్మోహన్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేటిలోగా రీసర్వే పనులు పూర్తిచేయాలి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 10: మూడో విడత రీసర్వే పనులు సచివాలయ సర్వేయర్లు, తహసీల్దార్లు గురువారంలోగా పూర్తిచేయాలని జేసీ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సాయంత్రం సీసీఎల్ఏ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జి. సాయిప్రసాద్ అమరావతి నుంచి అన్ని జిల్లాల జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిత్తూరు నుంచి పాల్గొన్న జేసీ మాట్లాడుతూ మూడో విడత సర్వే 106 గ్రామాల్లో జరుగుతున్నట్లు వివరించారు. 10,048 సర్వేరాళ్ల కోసం ప్రతిపాదనలు పంపగా, ఇప్పటివరకు 60,583 సర్వేరాళ్లు అందాయని, వాటిలో ఐదువేల సర్వేరాళ్లు నాటడం జరిగిందన్నారు. కోర్టు వివాద కేసులు లేని ప్రాంతాల్లో పట్టాల పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు. డీఆర్వో రాజశేఖర్, సర్వేశాఖ ఏడీ గౌస్ అహ్మద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు మురళి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి బిల్లులు ఇస్తారా.. చావమంటారా?

ప్రభుత్వంపై వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధుల ఆగ్రహం ● కార్యకర్తల సమావేశాన్ని బహిష్కరించి నిరసన

శాంతిపురం, జనవరి 10: 'నీటి బిల్లులు ఇస్తారా. మమ్మల్ని చావుమంటారా. ఎన్నేళ్లు ఈ అవస్థలు. ఎందుకు మా పై ఇంత కక్ష అంటూ ప్రభుత్వంపై వైసీపీ నేతలు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శాంతిపురం మండలం చౌడంపల్లె క్రాస్‌లోని కూరగాయల గ్రేడింగ్ యూనిట్ కేంద్రంలో బుధవారం వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, నేతలు హాజరయ్యారు. ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్ సమావేశానికి రాగానే.. వీరతా తొలుత నీటి బిల్లుల గురించి ప్రస్తావించారు. ఆ తర్వాత మాట్లాడదామని వారు చెప్పడంతో.. వీరంతా సమావేశాన్ని బహిష్కరించారు. బయటకు వచ్చి ప్లకార్డులతో నిరసన తెలిపారు. వైసీపీ అధికారంలోకి రాగానే.. ప్రజల దాహం తీర్చాలని పదేపదే చెబుతుంటే సొంత డబ్బు ఖర్చు చేసి నీటి సరఫరా చేశామన్నారు. ఆ బిల్లులను ఇప్పటికీ ఇవ్వకపోవడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. అప్పు చేసిన డబ్బుకు వడ్డీ కట్టలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ముఖ్య నేతలకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ధర్నాలు, నిరసనలు చేసినా ఫలితం లేకుండా పోయిందని మండిపడ్డారు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సుమారు. రూ.17 కోట్ల బకాయి ఉండగా.. అందులో రూ.9.25 కోట్లు శాంతిపురం మండలానికే రావాల్సి ఉందన్నారు. అప్పులకు వడ్డీలు కట్టలేక చాలామంది అజ్ఞాతంలోకి వెళ్లారని ఆవేదన వ్యక్తంచేశారు. వీరి వద్దకు ఎంపీ, ఎమ్మెల్సీ వచ్చి.. ఇప్పుడు సమయం కాదని, నీటి బిల్లులు ఇప్పించే బాధ్యత తమదని చెప్పినా వారు వినలేదు. చివరకు అమరావతి వెళ్లేందుకు ముఖ్యమైన నాయకులకు ఎమ్మెల్సీ బస్సు టికెట్లు బుక్ చేశారు. తాను గురువారం ఉదయం సచివాలయంలో కలస్తానని, మీరతా బస్సులో అక్కడికి వస్తే అధికారులతో మాట్లాడతామని చెప్పారు. అవసరమైతే సీఎం జగన్ వద్దకే తీసుకెళ్లి బిల్లులు ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో వీరు సమావేశానికి వెళ్లారు. నిరసన తెలిపిన వారిలో చెంగుబల్ల సర్పంచ్ భర్త భాస్కర్, ఎంకేపురం సర్పంచి భర్త మోహన్, ఎంపీటీసీ రాజప్ప, జగదీష్, మాజీ ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, మాజీ మండల వైసీపీ యువత అధ్యక్షుడు విజయకుమార్, లోకేష్‌రెడ్డి, మునస్వామి, శంకర్, మణి, రమణ, భాస్కర్, అబ్దుల్ పాల్గొన్నారు.



సమావేశాన్ని బహిష్కరించి నిరసన తెలుపుతున్న వైసీపీ నేతలు, ఇతర ప్రజాప్రతినిధులు